మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 20-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 232 Issue: 232

20 ఫిబ్రవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:43 సూర్యాస్తమయం - సా. 6:16 తిథి తదియ మ. 2:36 వరకు తరువాత చవితి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర రా. 7:56 వరకు తరువాత రేవతి యోగం సాధ్య సా. 6:14 వరకు కరణం గరజ మ. 2:36 వరకు వనిజ రా. 1:50 వరకు వర్జ్యం ఉ. 6:09 నుండి ఉ. 7:42 వరకు దుర్ముహూర్తం ఉ. 9:02 నుండి ఉ. 9:48 వరకు మ. 12:52 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 11:03 నుండి మ. 12:29 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:49 వరకు గుళికాకాలం ఉ. 8:10 నుండి ఉ. 9:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:07 నుండి తె. 5:55 వరకు అమృత ఘడియలు మ. 2:55 నుండి సా. 4:28 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:53 వరకు గమనిక: ౦౦ అనగా మరుసటి రోజున

## చక్కెర చిక్కిందోచ్!


### మూల కణ చికిత్సకు దొరికిన మధుమేహం

స్టెమ్ సెల్ థెరపీతో టైప్-2 డయాబెటిస్ దూరం

చైనా శాస్త్రవేత్తల అద్భుత పరిశోధన

మధుమేహ బాధితుల గోస అంతా ఇంతా కాదు. ముఖ్యంగా టైప్-2 డయాబెటిస్ వచ్చిందంటే, బతికి ఉండగానే నరకం కనిపిస్తుంది. ఈ సమస్యకు చైనా శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. స్టెమ్ సెల్ థెరపీ ద్వారా ఒక రోగిలో మధుమేహాన్ని విజయవంతంగా నయం చేశారు. గతంలో ఇన్సులిన్ వాడిన ఆ బాధితుడు.. ఇప్పుడు ఎలాంటి మందులు వాడకుండానే ఆరోగ్యంగా ఉన్నాడు.

బీజింగ్: చైనా శాస్త్రవేత్తలు స్టెమ్ సెల్ టెక్నాలజీని ఉపయోగించి, ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాటిక్ ఐలెట్ సెల్స్‌ను కృత్రిమంగా తయారు చేశారు. ఈ ల్యాబ్-ఇంజనీర్డ్ కణాలను రోగి శరీరంలోకి ప్రవేశపెట్టారు. ఈ కొత్త కణాలు సహజంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభించాయి. దీనివల్ల ఆ రోగికి ఇన్సులిన్ ఇంజెక్షన్లు లేదా ఇతర మందుల అవసరం లేకుండా పోయింది. అయితే, ఒక్క కేసులో విజయం సాధించినంత -2 వ పేజీలో...



## మే మొదటి వారంలో.. కొత్త పార్టీ

### పార్టీ పేరులో 'తెలంగాణ' పక్కా

సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీ చేస్తా

రాష్ట్రంలో బీజేపీ కనుమరుగవుతోంది

జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తాం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



మే మొదటి వారంలో మంచి ముహూర్తం చూసుకొని కొత్త పార్టీ పెడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తాను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయని తెలిపారు. గురువారం ఆమె మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణే తమ పార్టీ మదర్ బోర్డ్ అని, తాము పెట్టబోయే పార్టీలో తెలంగాణ అనే పదం తప్పకుండా ఉంటుందని వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తామేనని, ప్రజల సమస్యలను బలంగా లేవనెత్తుతున్నామని అన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో తామే ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. తెలంగాణలో బీజేపీ అనేది క్రమంగా కనుమరుగు అవుతున్నదని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీతో తరువాయి 2 వ పేజీలో...



## కోవర్టులూ.. గెట్ అవుట్

### 20 ఏళ్లుగా పార్టీని పీడిస్తున్నరు

నిజామాబాద్ ఎంపీ అర్వింద్

బీజేపీలో ఉంటూ 20 ఏళ్లుగా పార్టీని పీడిస్తున్న కోవర్టులు వెళ్లిపోవాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ బాగా బలపడిందని, దక్షిణ తెలంగాణలో మరింత బలోపేతం కావాల్సి ఉందని అన్నారు.

నిజామాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): బీజేపీ భూస్థాపితం అవుతుందన్న కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అర్వింద్ కొట్టిపారేశారు. 'ఎవరి వల్ల ఎవరు భూస్థాపితం అయ్యారో మీకు తెలియదా?' అని కవితను ప్రశ్నించారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని, కేసులు ఉన్నందువల్లే అండగా నిలిచిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో నిజామాబాద్‌లో -2 వ పేజీలో...

## ఐఏఎస్‌ల చెంచాగిరి

### అవినీతి లెక్కలు తీస్తున్నాం.. మంత్రుల చిట్టా రాస్తున్నాం

త్వరలోనే బయట పెడతా.. కేంద్ర మంత్రి బండి సంజయ్

కొందరు ఐఏఎస్‌లు మంత్రులకు చెంచాగిరి చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రుల అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే వివరాలు సేకరించి, అవినీతి చిట్టాను బహిర్గతం చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే.. వారి సంగతి చూస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలు గన్న 2047 వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరే వరకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొనసాగుతోందని పేర్కొన్న బండి సంజయ్.. ఐఏఎస్ అధికారులారా ఖబడ్దార్ అని హెచ్చరించారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాలన ఉండదని జోస్యం చెప్పారు. మంత్రి పదవి ఉందన్న అహంకారంతో బీజేపీని అడ్డుకోవాలని భావిస్తే.. వారి సంగతి చూస్తామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నాయకులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని తెలిపారు. మంత్రుల మెడలు వంచి.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,649 |
| వెండి (గ్రాము): | రూ.270 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,091 |

## కేసీఆర్ చేసిందేం లేదు!


### తెలంగాణ నీ అయ్య సొత్తా?.. ఇదేమైనా నీ అయ్య జాగీరా?

జాతిపిత అనటానికి సిగ్గుండాలి.. కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు



తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపిత అని పిలవడాన్ని తీవ్రంగా ఖండించిన కడియం శ్రీహరి.. ఆయన తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణకు జాతిపిత ఎలా అయ్యారో చెప్పాలని నిలదీశారు. జాతిపిత అని పిలవడానికి సిగ్గుండాలంటూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): తెలంగాణ ప్రజల సమస్యలపై స్పందించని వ్యక్తిని, అసెంబ్లీకి రాని వ్యక్తిని తెలంగాణ జాతిపితగా ఎలా గుర్తిస్తారు అని అడిగారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ అధికారంలో ఉన్న 10 ఏళ్ల పాలనలో.. రాష్ట్రం బాగుపడటం కంటే కేసీఆర్ కుటుంబమే ఆర్థికంగా చాలా బలపడిందని తీవ్ర ఆరోపణలు తరువాయి 2 వ పేజీలో...



## ఇల్లు గుల్ల చేస్తున్నారు!

ఇచ్చుకుంటూ పోతే దేశాభివృద్ధి ఎలా?

ఆర్థికాభివృద్ధికి ఆటంకం అని గుర్తించరా?

ఉచితాలపై రాష్ట్రాలు పునరాలోచించాలి


బదులుగా ఉపాధి అవకాశాలు కల్పించాలి

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం హితవు

దేశంలో వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉచితాలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగించే విధానాలను పునఃసమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గురువారం వ్యాఖ్యానించింది. దేశంలో మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. తమిళనాడు ఎన్నికల వేళ అధికార డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదన చేసింది.

న్యూఢిల్లీ: వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్‌ను అందించాలని తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ భావిస్తోంది. ఇందుకోసం విద్యుత్ సవరణ నియమాలు 2024లోని రూల్ 23ని సవాలు చేస్తూ తమిళనాడు విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటెడ్ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ రిట్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ప్రధాన తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి




స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు సూక్ష్మ రోబోలను అభివృద్ధి చేశారు. అవి రక్తనాళాల గుండా ప్రవహించి, స్ట్రోక్ నుంచి కాపాడుతాయి. తర్వాత ఎలాంటి హాని చేయకుండా వాటికవే రక్తంలో కలిసిపోతాయి.

## దిగొస్తారా? చస్తారా?

అణు ఒప్పందం చేసుకోకపోతే దాడి తప్పదు

ఇప్పటికే పశ్చిమాసియాలో రెడీగా మా సైన్యం

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్టిమేటం



అణు కార్యక్రమానికి సంబంధించి ఇరాన్ తప్పనిసరిగా తమతో ఒప్పందం చేసుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. లేదంటే పరిస్థితులు మరింత దిగజారుతాయని హెచ్చరించారు. ఇప్పటికే పశ్చిమాసియాలో సైన్యాన్ని మోహరిస్తున్నామని, ఒప్పందం చేసుకోలేదంటే దీన్ని మరింత ముందుకు వెళ్తామన్నారు.

వాషింగ్టన్: 'బోర్డ్ ఆఫ్ పీస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మరో 10 రోజుల్లో దాని ఫలితాన్ని మీరే చూస్తారని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. భారత్-పాక్‌ల మధ్య సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన కృషి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. ఘర్షణలు ఉద్ధృతంగా కొనసాగుతున్న వేళ ఇరు దేశాధినేతలతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించుకోకపోతే వాణిజ్య ఒప్పందం తరువాయి 2 వ పేజీలో...

## సర్.. సిద్ధం కండి!

### 22 రాష్ట్రాలకు ఈసీ లేఖ.. అందులో తెలుగు రాష్ట్రాలూ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సిద్ధంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 22 రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. బీహార్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో అమలు చేసిన 'ఎస్ఐఆర్' ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది.

న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, లడఖ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఢిల్లీ, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఎన్నికల సంఘం -2 వ పేజీలో...



## ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

### ఎగ్జామ్ సెంటర్ కోసం క్యూఆర్ కోడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు గురువారం రిలీజ్ చేసింది. విద్యార్థులకు తమ తమ కాలేజీల్లోనే హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

20.2.2026

మేషం: సమాజంలో పెద్దల అనుగ్రహంతో కీలకమైన పనులు పూర్తిచేస్తారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి .వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: వృత్తి, వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు మానసికంగా కొంత చికాకు కలిగిస్తాయి. ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కీలక విషయాలలో ఆలోచించి ముందుకు సాగాలి.

మిధునం: మాతృ వర్గ బంధు మిత్రులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి . వృత్తి వ్యాపారములలో నష్ట సూచనలున్నవి. అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

కర్కాటకం: ఆర్ధిక పరిస్థితి మరింత మెరుగు పడుతుంది. చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. బంధు, మిత్రులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి . నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగములలో బాధ్యతలు నిర్వహించడంలో లోటుపాట్లు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్ధిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. నేత్ర సంభందిత సమస్యలు కలుగుతాయి.

కన్య: నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు నూతన పెట్టుబడులు లభిస్తాయ. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. మొండి బాకీలు ఋణాలు తీర్చగలుగుతారు.

తుల: కీలక వ్యవహారాలలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు నిరాశ కలిగిస్తాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు ఇంటాబయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ద వహించాలి.

వృశ్చికం: కొన్ని పనులు అనుకూలంగా పూర్తిచేస్తారు. ఆర్థికంగా వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి .

ధనస్సు: దైవ సేవా కార్యక్రమాలు నిర్వహించి పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటారు. వృత్తి, ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. మొండి బాకీలు వసూలు అవుతాయి. గృహమున సంతాన వివాహ విషయమై చర్చలు జరుగుతాయి. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఇతరులతో ఆలోచించి మాట్లాడటం మంచిది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆర్ధిక వ్యవహారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు.

కుంభం: బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. నిరుద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక సమస్యలు కలుగుతాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి.

మీనం: చాలాకాలంగా వేధిస్తున్న స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతారు. ఆర్థిక విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార విషయమై పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. విద్యార్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు.



# మే లో కొత్త పార్టీ

**మొదటి పేజీ తరువాయి**

కలిసి పోటీ చేస్తామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి తమ పార్టీ గుర్తు వచ్చే అవకాశం ఉన్నదని, తమ పార్టీ గుర్తుపైనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఉంటుందని కవిత చెప్పారు. యువతకు పెద్దపీట వేస్తామన్నారు. రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరమున్నదని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 50 కమిటీలు వేశామని.. వాటి ద్వారా అనేక చర్చలు చేస్తున్నామని తెలిపారు. తమ పార్టీలో చేరేందుకు చాలా మంది బీఆర్ఎస్ నేతలు ఆసక్తితో ఉన్నారని.. చాలా మంది తనతో టచ్‌లో ఉన్నారని.. సందర్భం వచ్చినప్పుడు వివరాలు చెబుతానన్నారు. ప్రజల కోణంలో సామాజిక తెలంగాణ లక్ష్యంగా పార్టీ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది తమ పార్టీయేనని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక, పార్టీ పెట్టి ఫెయిల్ అయిన పురుషుల గురించి ఎందుకు మాట్లాడరు? అని కవిత ప్రశ్నించారు. షర్మిల ఏపీలో కాకుండా తెలంగాణలో పార్టీ పెట్టడాన్ని చాలా మంది తప్పుబట్టారని, ఆమె ఇప్పుడు ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలు అని గుర్తుచేశారు. ఆడవాళ్ల ఫెయిల్యూర్స్‌ని పెద్దగా చేసి చూపించడం సరికాదని, చిరంజీవి, దేవేందర్‌గౌడ్ గురించి ఎందుకు ప్రస్తావించరు? అని నిలదీశారు. రాజగోపాల్‌రెడ్డి పార్టీ పెడతానని బీజేపీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారని.. ఇప్పుడు మళ్లీ పార్టీ పెడతానని అంటున్నారని తెలిపారు. ఆయన గురించి కూడా ఎవరూ మాట్లాడరని.. మహిళలను మాత్రం తక్కువ చేసి చూస్తారని అన్నారు. ఇక, ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని విలీనం చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వమే ఆర్టీసీ విలీన ప్రక్రియ బిల్లును పూర్తి చేసిందని.. దానికి గవర్నర్ ఆమోదం తెలపలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లు ఆమోదం అయ్యేలా చేస్తే సరిపోతుందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో రేవంత్ సర్కార్ అమానవీయంగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం మొదలైన నాటి నుంచి వారిపై ఒత్తిడి పెరిగిందన్నారు. చిన్న కారణాలకే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. వారందరినీ వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒత్తిడి తట్టుకోలేక డ్రైవర్లు హార్ట్ ఆటాక్‌తో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 24న ఆర్టీసీ ఉద్యోగులు తలపెట్టిన చలో సెక్రెటేరియేట్ కార్యక్రమానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తున్నదని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం బాధ్యత తీసుకోవాలని కోరారు. మరోవైపు.. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని.. మేఘా కృష్ణారెడ్డికి ధారాదత్తం చేసే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో వాటిని అద్దెకు తీసుకొని వారికి కరెంట్, డిపోలను ఆర్టీసీయే ఇస్తున్నదని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సుల్లో కూడా ఆర్టీసీ ఉద్యోగులే ఉండాలని కోరారు. రాష్ట్ర కేబినేట్‌ను సీఎం రేవంత్ ఢిల్లీకి తీసుకెళ్లటంపై కవిత మండిపడ్డారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపర్చటమేనని అన్నారు. గతంలో మంత్రివర్గం ఎర్రవెల్లికి వెళితే.. ఇప్పుడు ఢిల్లీకి వెళుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశాలు సచివాలయంలోనే జరగాలని అన్నారు. ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకోని కేటీఆర్ మాట్లాడుతున్నారని.. ఎవరు ఉద్యమకారులో, ఎవరు ఉద్యమ ద్రోహులో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు.

# ఇల్లు గుల్ల చేస్తున్నారు!

**మొదటి పేజీ తరువాయి**

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీజేఐ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలకు ముందు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 'ఉచితాలను' ప్రకటించే ధోరణిని ధర్మాసనం మౌఖికంగా ఖండించింది. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న ఉచితాల సంస్కృతిని తీవ్రంగా విమర్శించింది. ఇది ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొంది. దేశంలోని చాలా రాష్ట్రాలు రెవెన్యూ లోటులో ఉన్నప్పటికీ అభివృద్ధిని పట్టించుకోకుండా అలాంటి ఉచితాలను అందిస్తున్నాయని సీజేఐ ధర్మాసనం ప్రస్తావించింది. అందరికీ ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌ను ఇవ్వడానికి బదులుగా ఉపాధి కోసం మార్గాలను తెరవడానికి రాష్ట్రాలు కృషి చేయాలని ధర్మాసనం పేర్కొంది. అలా కాకుండా ఇలాంటి ఉచితాలు పంపిణీ చేస్తే... ఎవరు పనిచేస్తారని ప్రశ్నించింది. "దేశంలోని చాలా రాష్ట్రాలు ఆదాయ లోటు ఉన్న రాష్ట్రాలు... అయినప్పటికీ ప్రభుత్వాలు అభివృద్ధిని పట్టించుకోకుండా ఇలాంటి ఉచితాలను అందిస్తున్నాయి. భారతదేశంలో మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాము? విద్యుత్ ఛార్జీలు చెల్లించలేని వారికి సంక్షేమ చర్యలో భాగంగా మీరు అందించాలనుకుంటున్నారంటే దానిని అర్థం చేసుకోవచ్చు... కానీ విద్యుత్ బిల్లులు భరించగల వారికి, భరించలేని వారికి మధ్య తేడాను గుర్తించకుండా మీరు అమలు చేయడం ఎంతవరకు సమంజసం?" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. అయితే, ఉచిత విద్యుత్ అందించాలనే తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ విజ్ఞప్తిపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం, ఇతరులకు సీజేఐ ధర్మాసనం నోటీసు జారీ చేసింది.

# ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

**మొదటి పేజీ తరువాయి**

ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు బోర్డు అధికారులు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను ఆయా కాలేజీల ఆన్‌లైన్ లాగిన్‌ల్లో అందుబాటులో ఉంచినట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఇంటర్ విద్యార్థులు కాలేజీ ప్రిన్సిపాళ్లను సంప్రదించి తమ హాల్ టికెట్లను తీసుకోవాలని అధికారులు సూచించారు. తాజాగా విడుదలైన హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉంటే.. ఆ విద్యార్థులు వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయా ప్రిన్సిపాల్స్ బోర్డు దృష్టికి తీసుకువచ్చి వాటిని వీలైనంత త్వరగా సరిచేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ ఎగ్జామ్ సెంటర్‌ను సులభంగా వెతుక్కునేందుకు వీలుగా ఈసారి ఇంటర్ హాల్ టికెట్లపై స్పెషల్‌గా క్యూఆర్ కోడ్‌ను కూడా బోర్డు అధికారులు ముద్రించారు. ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తమ పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో సులువుగా తెలుసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. విద్యార్థులకు మరింత ఈజీగా ఉండటం కోసం.. సెల్‌ఫోన్ ద్వారా కూడా హాల్ టికెట్లను పొందే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇంటర్ బోర్డు వద్ద నమోదు చేసుకున్న రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు కూడా నేరుగా ఎస్ఎంఎస్ పంపించనున్నట్లు వెల్లడించారు. అందులో ఉండే లింక్‌ను ఉపయోగించుకుని హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోనున్నట్లు టీజీబీఐఈ స్పష్టం చేసింది. ఇంటర్ పరీక్షలు ఈనెల 25వ తేదీన ప్రారంభమై మార్చి 18వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ పరీక్షలు మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈనెల 25వ తేదీన ఇంటర్ ఫస్ట్ ఇయర్.. 26వ తేదీన ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

# ఐఏఎస్‌ల చెంచాగిరి

**మొదటి పేజీ తరువాయి**

ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసేలా చేస్తామని చెప్పారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు.. సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధి కావాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే దిక్కు అని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఈ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత 2 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ పాలనలో జీహెచ్ఎంసీ పరిధిలో తట్ట మొరం కూడా పోసిన దాఖలాలు లేవని.. హైదరాబాద్ నగర ప్రజలు అందరూ ఏకమై రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెప్పిందన్న బండి సంజయ్.. ఆ డబ్బులన్నీ ఎటుపోయాయని ప్రశ్నించారు. ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు.. ఎన్ని యూనిట్లు మొదలుపెట్టారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సార్లు దావోస్‌కు వెళ్లి తెలంగాణలో రూ.2.15 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని చెప్పారని.. వాటి ద్వారా ఇప్పటిదాకా ఎన్ని పెట్టుబడులు వచ్చాయి.. ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఇది టీపీసీసీ కాదని టీ4సీ (తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్, కాంగ్రెస్) అని బండి సంజయ్ ఆరోపించారు. హైదరాబాద్ ఎన్నికల్లో నగరవాసులు కాంగ్రెస్ పార్టీని మూసీ నదిలో పడేయడం ఖాయమన్నారు. హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే గుణపాఠం చెప్పబోతున్నారన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలు 2 ఏళ్లలో ఏం చేశారో చెప్పాలని నిలదీయాలని హైదరాబాద్ ప్రజలకు బండి సంజయ్ పిలుపునిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి మూటలు పంపించడానికే ఉన్నారని.. అంతే తప్ప తెలంగాణ అభివృద్ధికి చేసిందేమి లేదని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురు తీసుకున్నారని.. అవి ప్రశ్నిస్తున్న వృద్ధులను జైలులో వేసేందుకు సిగ్గు లేదా అని మండిపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పనిచేశాయని బండి సంజయ్ ఆరోపించారు. రెండు పార్టీలు కలిసి ఎన్ని కుట్రలు చేసినా కరీంనగర్ ప్రజలు మాత్రం వారి చెంప చెళ్లుమనిపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు కూడా కరీంనగర్ కార్పొరేషన్‌లో కుట్రలు చేశారని.. గెలిచిన కార్పొరేటర్లకు బ్లాంక్ చెక్కులు, కార్లను ఆఫర్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పెద్ద నేతలు ఈ కుట్రలో భాగంగా ఉన్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా జీహెచ్ఎంసీని విభజించడంపై బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాభిప్రాయ సేకరణ, అఖిలపక్ష సమావేశం, ప్రజాప్రతినిధుల అభిప్రాయం లేకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీని ఎందుకు 3 కార్పొరేషన్లు చేశారో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీకి భయపడి.. హైదరాబాద్‌లో హిందూ ఓట్లను చీల్చేందుకే జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారని విమర్శించారు.

# కేసీఆర్ చేసిందేం లేదు!

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు అందరూ.. ఏదో ఒక కుంభకోణంలో చిక్కుకున్నారని పేర్కొన్నారు. వారు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారని.. దీనివల్ల భవిష్యత్ తరాలపై తీవ్ర ఆర్థిక భారం పడేశారని మండిపడ్డారు. అదే సమయంలో ఇటీవల కేసీఆర్ వాడి పదజాలంపైనా కడియం శ్రీహరి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏమైనా నీ అయ్య సొత్తా.. నీ అయ్య జాగీరా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ.. కేసీఆర్‌లో మాత్రం అహంకారం కొంచెం కూడా తగ్గలేదని అన్నారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలను గౌరవించడం రాదని విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల సమస్యలపై స్పందించకుండా కేవలం ఫామ్‌హౌస్‌లోనే ఉంటున్న కేసీఆర్.. నాయకుడెలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణను లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో ముంచిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. తెలంగాణ అంటే ఒకరి సొత్తు కాదని.. ఇది తెలంగాణ ప్రజల పోరాట ఫలితం అని పేర్కొన్నారు.

# కోవర్టులూ.. గెట్ అవుట్

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ ఓటమి పాలైంది. ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ 17 స్థానాల్లో గెలిచి, ఎంఐఎం (14 డివిజన్లు), ఇద్దరు ఎక్స్అఫీషియో సభ్యులు, మరో బీఆర్ఎస్ అభ్యర్థి మద్దతుతో సంఖ్యా బలాన్ని 34కి చేర్చుకుంది. బీజేపీ 28 స్థానాల్లో విజయం సాధించినా మేయర్ పీఠం దక్కలేదు.

# దిగొస్తారా? చస్తారా?

**మొదటి పేజీ తరువాయి**

కుదుర్చుకోనని వారికి స్పష్టం చేశానని, 200శాతం సుంకాలు విధిస్తానంటూ బెదిరించినట్లు తెలిపారు. ఈ యుద్ధం ఆపడం ద్వారా 2.5కోట్ల మంది ప్రాణాలను రక్షించారని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనతో చెప్పారని అన్నారు. ప్రధాని మోదీ బాగా తెలుసునని, ఆయన గొప్ప వ్యక్తి అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక, గాజా పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని, ఇందుకు తొమ్మిది సభ్య దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇందుకోసం 7 బిలియన్ డాలర్లు (రూ.63వేల కోట్ల) ప్యాకేజీ ఇచ్చేందుకు నిబద్ధతతో ఉన్నామన్నారు. అమెరికా కూడా బోర్డ్ ఆఫ్ పీస్‌కు 10 బిలియన్ డాలర్లు ఇస్తుందని హామీ ఇచ్చారు.

# చక్కెర చిక్కిందోచ్!

**మొదటి పేజీ తరువాయి**

మాత్రాన ఇది అందరికీ అందుబాటులోకి వచ్చినట్లు చెప్పలేమని వైద్య నిపుణులు చెప్తున్నారు. వేల మంది రోగులపై పరీక్షలు జరిపి ఇది అందరిలోనూ పనిచేస్తుందని నిరూపించాలని, ఈ ప్రభావం ఎన్ని ఏళ్ల పాటు ఉంటుందో వేచి చూడాలని అంటున్నారు. ఈ చికిత్స వల్ల శరీరం ఈ కొత్త కణాలను తిరస్కరించే ప్రమాదం లేకపోలేదని పేర్కొంటున్నారు. ఒకవేళ ఈ చికిత్స అందరిలోనూ విజయవంతమైతే, డయాబెటిస్ వల్ల వచ్చే గుండె జబ్బులు, కిడ్నీ ఫెయిల్యూర్, కంటి చూపు మందగించడం వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చని అంటున్నారు.

# సర్.. సిద్ధం కండి!

**మొదటి పేజీ తరువాయి**

లేఖ రాసింది. ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముంది. దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియను చేపట్టాలని గత ఏడాది జూన్ నెలలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీహార్‌లో ఈ ప్రక్రియ పూర్తయింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అసోంలో మాత్రం 'ఎస్ఐఆర్'కు బదులు ప్రత్యేక సవరణ పేరుతో ఓటరు జాబితా సవరణను పూర్తి చేశారు.

# హైదరాబాద్ బిర్యానీ స్కాం..

# 70,000 కోట్లు

## ఏఐ టూల్స్‌తో పట్టేసిన ఐటీ అధికారులు

హైదరాబాదీ బిర్యానీ కేంద్రంగా రూ. 70 వేల కోట్ల భారీ పన్ను ఎగవేత ను ఐటీ శాఖ తాజాగా గుర్తించడం.. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బిగ్ డేటా సాయంతో రెస్టారెంట్ల బిల్లింగ్ డేటాను విశ్లేషించిన ఐటీ శాఖ.. 1.77 లక్షల రెస్టారెంట్లు సాఫ్ట్‌వేర్ ద్వారా బిర్యానీ అమ్మకాలను మాయం చేసినట్లు తేలింది. బిల్లులను పూర్తిగా డిలీట్ చేయడం, తగ్గించడం వంటి పద్ధతులతో 2019 నుంచి ఈ మోసం జరిగినట్లు తాజా విచారణలో వెల్లడైంది.




హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పన్ను ఎగవేత అధికంగా ఉన్నట్లు తేల్చారు. దాదాపు 27 శాతం అమ్మకాలను లెక్కల నుంచి తొలగించారని అధికారులు నిర్ధారించారు. అయితే ఇది ఇప్పటివరకు దొరికిందేనని.. విచారణ జరిపితే మరింత ఎక్కువ స్కామ్ బయటపడుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ బిర్యానీ హోటల్‌లో మొదలైన చిన్న తనిఖీ, దేశవ్యాప్తంగా దాదాపు 70 వేల కోట్ల భారీ పన్ను ఎగవేతను బయటపెట్టింది. చాలా హోటళ్లు భారీగా లాభాలు సంపాదిస్తున్నా, ప్రభుత్వానికి మాత్రం తక్కువ ఆదాయం వస్తున్నట్లు చూపిస్తున్నాయి. ఇలా పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని పోలీసులు గుర్తించారు. సమాచారం ప్రకారం, గత కొన్నేళ్లుగా ఇలా దాదాపు 70వేల కోట్ల దాకా పన్ను ఎగవేత జరిగినట్లు తెలుస్తోంది. హోటళ్లలో కస్టమర్లు తిన్న ఫుడ్‌కు సిస్టమ్ జనరేటెడ్ బిల్ తయారు చేసేందుకు ఉపయోగించే ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఐటీ అధికారులు ఈ మోసాన్ని మొదట వెలుగులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో దొరికిన తీగను లాగితే.. దేశవ్యాప్తంగా డొంక కదలింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో లక్షలాది హోటళ్లు ఒకే రకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 1.77 లక్షల హోటళ్ల రికార్డులు.. 60 టెరాబైట్ల సమాచారాన్ని ఏఐ, జనరేటివ్ ఏఐ, బిగ్ డేటా అనలిటిక్స్ టూల్స్‌ను ఉపయోగించి ఈ కుంభకోణాన్ని బయటికి తీశారు. రెస్టారెంట్లలో అవకతవకలు జరగకుండా ఉండేందుకు నగదు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, యూపీఐ ద్వారా వచ్చే ప్రతి పైసాను సాఫ్ట్‌వేర్‌లో స్టోర్ చేస్తారు. అయితే ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సులను తప్పించుకునేందుకు కొన్ని రెస్టారెంట్లు రకరకాల పద్ధతులను పాటించినట్లు గుర్తించారు. ప్రధానంగా బిల్లులను ఎంపిక చేసి డిలీట్ చేయడం, కొన్ని రోజుల పాటు బిల్లింగ్ డేటాను సాఫ్ట్‌వేర్ నుంచి పూర్తిగా తొలగించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఉదాహరణకు.. ఒకచోట రూ. 2,784 బిల్లును కేవలం రూ. 27కి తగ్గించినట్లు గుర్తించారు. ఏఐ డేటా విశ్లేషణలో దేశవ్యాప్తంగా రూ. 13,317 కోట్ల విలువైన బిల్లులను డిలీట్ చేసినట్లు తేలింది. కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనే రూ. 5,141 కోట్ల అమ్మకాలను మాయం చేసినట్లు తెలిపారు. 40 రెస్టారెంట్లలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ. 400 కోట్ల పన్ను ఎగవేసినట్లు బయటపడింది. ట్యాక్స్ ఎగవేత అధికంగా ఉన్న తొలి 5 రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ ఉన్నాయి. కర్ణాటక రూ. 2 వేల కోట్ల బిల్లుల తొలగింపుతో మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ రూ. 1,500 కోట్లు.. తమిళనాడు రూ. 1,200 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం అమ్మకాల్లో సగటున 27 శాతం ఆదాయాన్ని రెస్టారెంట్లు తక్కువగా చూపించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## బీఆర్ఎస్ అనబోయి బీజేపీ అన్నారేమో

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**




హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): మే నెల మొదటి వారంలో తమ పార్టీని ప్రకటిస్తామని తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో బీజేపీ భూస్థాపితం అవుతుందని చేసిన వ్యాఖ్యలపై ఆయన విమర్శలు గుప్పించారు. కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది ఆయన వ్యాఖ్యానించారు. ఆమె పొరపాటున తమ పార్టీ పేరును పేర్కొన్నట్లుగా ఉందని అన్నారు. కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితం అయ్యేది బీఆర్ఎస్ తప్ప తమ పార్టీ కాదని ఆయన అన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు, ఎవరి చేతిలో ఓడిపోయారో ఒకసారి గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్ల శాతం పెరిగిందని రామచందర్ రావు అన్నారు. కాగా, ఈరోజు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శివాజీ దేశం కోసం, ధర్మం కోసం మొఘలులతో పోరాడారని అన్నారు. ఆయన తన హయాంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.

## గేమింగ్ స్కాం.. 13,000 కోట్లు

**నకిలీ కేవైసీలతో బ్యాంకులకు మోసం**

**హైదరాబాద్‌లో కీలక సూత్రధారి అరెస్ట్**




హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ. 13,000 కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్‌లో హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ భారీ మోసంలో ప్రధాన సూత్రధారులలో ఒకరైన పంకజ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అడ్సుమ్ అడ్వైజరీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌గా ఉన్న పంకజ్ కుమార్, ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించినట్టు అధికారులు గుర్తించారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లకు అండగా నిలుస్తూ, వాటి కార్యకలాపాలకు సహకరించడమే లక్ష్యంగా ఈ సిండికేట్ పనిచేసింది. ఇందులో భాగంగా, పంకజ్ కుమార్ నకిలీ కేవైసీ పత్రాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషించారు. డొల్ల కంపెనీలు (షెల్ ఎంటిటీలు), నకిలీ వ్యాపారుల పేరిట మోసపూరిత కేవైసీలను తయారు చేసి, వాటి ద్వారా ఆర్‌బీఐ నియంత్రణలో ఉండే పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకుల నుంచి పేమెంట్ అగ్రిగేటర్ సేవలను పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నకిలీ కేవైసీల ద్వారా గేమింగ్ వెబ్‌సైట్లు తమ అక్రమ లావాదేవీలను చట్టబద్ధమైనవిగా చిత్రీకరించే ప్రయత్నం చేశాయి. ఫిన్‌టెక్ కంపెనీల సహాయంతో ఈ వ్యవస్థీకృత ముఠా భారీ ఎత్తున మోసాలకు పాల్పడినట్టు జీఎస్టీ అధికారులు తెలిపారు. ఈ కేసులో పంకజ్ కుమార్ అరెస్ట్ అత్యంత కీలకమని, దర్యాప్తును మరింత లోతుగా కొనసాగిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## పీపీపీకి సర్కారు అండ: శ్రీధర్ బాబు

న్యూఢిల్లీ: అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి తెలంగాణలో పీపీపీని ప్రోత్సహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఆయన పాల్గొన్నారు. అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలకు తెలంగాణ వేదికగా ఉందని మంత్రి అన్నారు. పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వ స్థిరమైన విధానాల కారణంగా ఏఐ పరిశోధనలకు రాష్ట్రం వేదికగా మారింది. ప్రజాసేవల్లోనూ ఏఐ ద్వారా వేగంగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## 200 కి.మీ దూరంలో ఉన్న జైలుకు తెస్తరా?

**బాల్క సుమన్ అరెస్టుపై హరీశ్ రావు ఆగ్రహం**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ఆదిలాబాద్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో మాజీ మంత్రి హరీశ్ రావు ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. క్యాతనపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. "ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మహిళల పట్ల కాంగ్రెస్ నేతలు అసభ్యకరంగా ప్రవర్తించారు. మంత్రి వివేక్ సైతం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం మత్తులో బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లను అగౌరవపరిచారు. అయినా పోలీసులు చోద్యం చూశారు. బాల్క సుమన్‌ను సమీప జైల్లో పెట్టకుండా 200 కి.మీ దూరంలో ఉన్న ఆదిలాబాద్ జైలుకు తరలించడం అన్యాయం" అని హరీశ్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుంటే రాహుల్ గాంధీకి పట్టదా? అని ప్రశ్నించారు. ప్రజల రక్షణ కోసం కవాతు నిర్వహించాల్సిన పోలీసులు బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు కవాతు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని... పోలీసులు అత్యుత్సాహం చూపిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు, ఈ ములాఖత్‌లో మాజీ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నాయకులు దివాకర్ రావ్, ప్రవీణ్ కుమార్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌కు హైకోర్టు ఊరట

**కోర్టు హాజరు నుంచి మినహాయింపు**



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ హైకోర్టు మరో భారీ ఊరటను కల్పించింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన పలు కేసుల్లో భూపాలపల్లి కోర్టు ముందు హాజరు కావడాన్ని మినహాయింపును కల్పిస్తూ తాజాగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాలకు సంబంధించి.. ఆధారాలు లేకుండా తనపై తీవ్ర ఆరోపణలు చేశారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి చేసిన ఫిర్యాదుతో రేవంత్ రెడ్డిపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. అయితే తనపై నమోదైన ఈ రెండు కేసులను కొట్టి వేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ రెండు కేసుల్లో భూపాలపల్లి కోర్టుకు వెళ్లి ప్రత్యక్షంగా రేవంత్ రెడ్డి హాజరు కావడాన్ని మినహాయిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఈ కేసులకు సంబంధించి గండ్ర వెంకటరమణా రెడ్డి తరఫు లాయర్.. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరారు. దీంతో ఈ కేసులో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ.. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## 6 గ్యారెంటీలకు నిధులు కేటాయించాలి

**సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**






హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పదవీకాలం పూర్తికావస్తున్న తరుణంలో, ఇచ్చిన హామీల అమలుకు రాబోయే బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా చిత్తశుద్ధి చూపాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటి అమలును పూర్తిగా పక్కన పెట్టిందని కేటీఆర్ తన లేఖలో విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. గత రెండు బడ్జెట్లలోనూ హామీల అమలుకు అవసరమైన కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో 2026-27 బడ్జెట్‌లో అయినా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ఇచ్చిన హామీల మేరకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓపిక నశిస్తోందని, వారిని ఇకపై వేచి చూసేలా చేయవద్దని సూచించారు. కేవలం గ్యారెంటీలే కాకుండా, ఎన్నికలకు ముందు వివిధ డిక్లరేషన్ల రూపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. గత రెండేళ్లుగా ఆయా వర్గాలకు చెల్లించాల్సిన నిధులు, బకాయిలను ఈ బడ్జెట్‌లో చేర్చి వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. ఒకవేళ ఈ బడ్జెట్‌లో కూడా హామీల అమలుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా 'మోసకారి కాంగ్రెస్'ను ప్రజల పక్షాన ఎక్కడికక్కడ నిలదీస్తాం అని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఇంకెంతమాత్రం ఓపికపట్టే స్థితిలో లేదని, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని తన లేఖలో స్పష్టం చేశారు.

## తెలంగాణ తల్లి విగ్రహాలకు 5.8 కోట్లే!

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): జిల్లాల్లో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చు చేస్తోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం కేవలం అపోహ మాత్రమేనని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ అధికారిక ప్రకటన చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవం అని, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఉందని తెలిపింది. వాస్తవానికి వీటి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం కేవలం రూ. 5.8 కోట్లు మాత్రమేనని స్పష్టం చేసింది. తెలంగాణ తల్లి విగ్రహాల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చు చేస్తోందన్న వార్తల్లో నిజం లేదని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ స్పష్టం చేశారు. వీటి కోసం తెలంగాణ ప్రభుత్వ రోడ్లు మరియు భవనాల (=ఒదీ) శాఖ మొత్తం రూ. 5.8 కోట్ల బడ్జెట్‌ను మాత్రమే మంజూరు చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల 'సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల' (×ఙూజ) ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఈ నిధులు కేటాయించారు. ఒక్కో విగ్రహం ఏర్పాటుకు సుమారు రూ. 17 లక్షల వరకు వ్యయం అవుతుంది. మొత్తం వ్యయం రూ. 5.8 కోట్లు మాత్రమే, ప్రచారంలో ఉన్నట్టుగా రూ. 200 కోట్లు కాదు. ఈ విగ్రహాల తయారీ, ప్రతిష్ఠాపన పనులను =ఒదీ శాఖ స్వయంగా పర్యవేక్షిస్తుంది. ఈ పనులన్నింటినీ ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ. 200 కోట్ల ఖర్చు గురించి అతిశయోక్తితో కూడిన ఆర్థిక గణాంకాలతో వస్తున్న పోస్టులు పూర్తిగా నిరాధారమైనవి. పౌరులు ఇటువంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.




## 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

**28న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి!**





హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలకు రంగం సిద్ధమైంది. ఈనెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచనాప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగబోయే కేబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు నాడు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 28వ తేదీన శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అదే సమయంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శాసన మండలిలో బడ్జెట్ ప్రవేశపెడతారు. ఈ సారి 10 నుంచి 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ఆర్థిక శాఖ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు తుది మెరుగులు దిద్దుతోంది. ఇప్పటికే బడ్జెట్ ప్రక్రియను పూర్తి చేసిన ఆర్థిక శాఖ తుది మెరుగులు దిద్దుతుంది. మరోవైపు ఆర్థికశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈనెల 28న శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. గత బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు భారీగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. సభలో ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు సమాధానం ఇవ్వడంతో పాటు...పలు కీలక బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ఆమోదించుకోవాలనే యోచనలో అధికార పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరగనున్నట్లు తెలుస్తోంది. శాసనమండలి సమావేశాలు పాత అసెంబ్లీ హాల్లో నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే అసెంబ్లీ సిబ్బంది ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలుస్తోంది.


## మీకో దండంరా.. నాయనా!

**మీడియాతో మాట్లాడని ఐబొమ్మ రవి.. చిరునవ్వుతో జైలు నుంచి బయటకు**



చంచల్‌గూడ-హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): సినిమాల పైరసీ కేసులో ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. సినిమాల పైరసీ కేసులో అరెస్టయిన 'ఐబొమ్మ' రవి చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. తెలంగాణ హైకోర్టు మంగళవారం అతడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో బుధవారం సాయంత్రం రవి జైలు నుంచి బయటకు వచ్చాడు. అయితే జైలు నుంచి బయటికి వచ్చిన సందర్భంగా మీడియా అతడిని మాట్లాడించే ప్రయత్నం చేసింది. మిమ్మల్ని పైరసీ దొంగ అంటున్నారు... దానికి మీరేమంటారు అంటూ ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించాడు. అందుకు రవి చిరునవ్వే సమాధానంగా, రెండు చేతులు జోడించి నమస్కారం పెడుతూ ముందుకు సాగిపోయాడు. మీడియా ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అతడు ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. కారులో ఎక్కిన తర్వాత కూడా మీడియా ప్రతినిధులకు నమస్కారం పెడుతూ, చిరునవ్వే సమాధానం అన్నట్టుగా మౌనంగా ఉండిపోయాడు. గతేడాది నవంబర్‌లో ఐబొమ్మ వెబ్ సైట్ ద్వారా కొత్త సినిమాలను అక్రమంగా అప్‌లోడ్ చేస్తున్నాడన్న ఆరోపణలతో సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేశారు. అతనిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈనాడు కథనం ప్రకారం, హైకోర్టు అతనికి పలు కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేసింది. దేశం విడిచి వెళ్లకూడదని, తన పాస్‌పోర్టును కోర్టులో స్వాధీనం చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా, ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని స్పష్టం చేసింది.

## యూట్యూబర్ అన్వేష్ ఇన్‌స్టా డిలీట్



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ప్రముఖ యూట్యూబర్ 'నా అన్వేష్' కు బిగ్ షాక్ తగిలింది. ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ మెటా అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేసింది. ఇటీవల అన్వేష్ దేశాన్ని దూషించడంతో పాటు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుల్లో తన సోషల్ మీడియా అకౌంట్లలో అన్వేష్ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదులపై హైదరాబాద్ సీసీఎస్ పోలీలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో అన్వేష్ సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించారు. వాటిల్లో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో కంటెంట్ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నట్లు గుర్తించారు. ఇదే అంశంపై ఇన్‌స్టా మాతృ సంస్థ మెటాను సంప్రదించారు. అన్వేష్ అకౌంట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెటా సైతం అన్వేష్ ఇన్‌స్టా అకౌంట్‌లను పరిశీలించింది. అనంతరం, అతడి అకౌంట్లపై నిషేదం విధించింది. గతంలో అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 1.8 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండేవారు. హిందూమతం, భారతదేశంపై అనుచిత కామెంట్లు చేయడంతో అతడి ఫాలోవర్ల సంఖ్య 1.3 మిలియన్లకు తగ్గింది. తాజాగా ఖాతా పూర్తిగా బ్యాన్ అయింది



## మల్యాలలో ఘనంగా శివాజీ శోభాయాత్ర

మల్యాల, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ఛత్రపతి శివాజీ 396వ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా మల్యాలలో శివాజీ యువసేన ఆధ్వర్యంలో శివాజీ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శోభాయాత్రలో హిందూ బంధువులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం 1.16 కోట్లు

మల్యాల, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ లెక్కింపు ద్వారా ఆలయానికి రూ. 1.16 కోట్ల ఆదాయం సమకూరింది. గురువారం ఆలయ ప్రాంగణంలో శ్రీ లలిత సేవా ట్రస్ట్-రాజన్న సిరిసిల్ల జిల్లా వారి సహకారంతో, దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకుడు రాజమొగిలి పర్యవేక్షణలో 14 హుండీలను తెరిచారు. 43 రోజులకు గాను, రూ. 1,16,04,438 ఆదాయం సమకూరింది. హుండీలు లెక్కింపు చేయగా వచ్చిన మిశ్రమ వెండి, బంగారాన్ని తిరిగి సీల్ చేసి హుండీలో భద్రపరిచారు. విదేశీ కరెన్సీ (199) నోట్స్ వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీకాంతారావు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఏఈవో హరిహరనాథ్, డీ సునీల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ, రఘు, ఆలయ సిబ్బంది, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, హటరీంగార్డ్స్, బ్యాంక్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆధారాల సేకరణలో

## జాగిలాల సేవలు కీలకం

### జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడి



జగిత్యాల, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): నేరాల ఛేదించే క్రమంలో అవసరమయ్యే ఆధారాలు అందించడంలో పోలీస్ జాగిలాల సేవలు గొప్పవని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ విభాగానికి చెందిన 'రాఖీ' అనే నూతన పోలీస్ జాగిలం (ఐఐటీఏ), మొయినాబాద్ లో 8 నెలల శిక్షణ ను విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డాగ్ హ్యాండ్లర్ రమేశ్‌కు ఎస్పీ సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, హెడ్ కానిస్టేబుల్ కూర్మ రావు, కానిస్టేబుల్లు రమేశ్, నాంపల్లి పాల్గొన్నారు

## టీవీ సౌండ్ లొల్లి.. భర్త హత్య

### ఏపీలోని మంగళగిరిలో దారుణం!

మంగళగిరి, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): గుంటూరు జిల్లా మంగళగిరిలో తీవ్ర కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది. టీవీ సౌండ్ తగ్గించమని చెప్పినందుకు ఓ భార్య క్షణికావేశంలో భర్తను కత్తితో పొడిచి హత్య చేసింది. ఈ దారుణ ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంగళగిరిలోని టిడ్కో గృహ సముదాయంలో మొహమ్మద్, క్రాంతి దంపతులు నివసిస్తున్నారు. ఏడాది క్రితం వీరు ప్రేమ వివాహం చేసుకున్నారు. బుధవారం రాత్రి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో సౌండ్ ఎక్కువగా ఉందని, తగ్గించమని మొహమ్మద్ తన భార్య క్రాంతికి చెప్పాడు. ఈ చిన్న విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. కొద్దిసేపటికే గొడవ తీవ్రస్థాయికి చేరడంతో ఆవేశానికి లోనైన క్రాంతి, ఇంట్లోని కత్తితో మొహమ్మద్‌పై దాడికి పాల్పడింది. విచక్షణారహితంగా పలుమార్లు పొడవడంతో తీవ్ర రక్తస్రావమై మొహమ్మద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనను గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అప్పటికే మృతి చెందిన మొహమ్మద్‌ను గుర్తించారు. నిందితురాలు క్రాంతిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేవలం టీవీ సౌండ్ విషయంలో తలెత్తిన వివాదం హత్యకు దారితీయడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

## చెత్తబండిలో కులవర్ధన్ డెడ్‌బాడీ

### మృతదేహాన్ని స్వీకరించని తల్లిదండ్రులు

### చెత్త బండిలో తరలించి అంత్యక్రియలు

మదనపల్లె, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు కులవర్ధన్‌కు అత్యంత దారుణమైన ముగింపు లభించింది. కడసారి చూపునకు కూడా కన్నతల్లి నిరాకరించడంతో, అతని మృతదేహానికి మున్సిపల్ సిబ్బందే అనాథ శవంలా అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని చెత్త తరలించే ఆటోలో తరలించి దహన సంస్కారాలు పూర్తిచేశారు. చిన్నారిపై ఘాతుకానికి పాల్పడిన కులవర్ధన్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, అతను తప్పించుకుని పారిపోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం అతని మృతదేహాన్ని మదనపల్లె ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే, డెడ్‌బాడీని తీసుకెళ్లేందుకు తల్లితో పాటు బంధువులెవరూ ముందుకు రాలేదు. తమకు అతనితో ఎలాంటి సంబంధం లేదని సోదరి తేల్చి చెప్పింది. దీంతో అతని మృతదేహం ఆసుపత్రిలో అనాథలా పడి ఉంది. చివరకు అతని పెదనాన్న ముందుకు వచ్చి సంతకం చేయడంతో, మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. వారు చెత్త తరలించే వాహనంలో మృతదేహాన్ని శ్మశానానికి తరలించి అంతిమ సంస్కారాలు జరిపారు. కులవర్ధన్ మరణవార్త తెలియగానే మదనపల్లె వాసులు సంబరాలు చేసుకున్నారు. అత్యాచార నిందితుడికి సరైన శిక్ష పడిందని, న్యాయం జరిగిందంటూ బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పల్నాడు జిల్లాలో భూప్రకంపనలు

### రిక్టర్ స్కేలుపై 3.5గా తీవ్రత

పల్నాడు, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ కూడా ధ్రువీకరించింది. పల్నాడు జిల్లాలో రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రతతో భూకంపం సంభవించినట్టుగా తెలిపింది. గురువారం తెల్లవారుజామున 2:33 గంటలకు భూకంపం సంభవించినట్టుగా పేర్కొంది. భూకంప కేంద్రం భూ అంతర్భాగంలో 10 కి.మీ లోతులో ఉందని తెలిపింది. అయితే వినుకొండకు 20 కి.మీ దూరంలో భూకంపం సంభవించిందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఐదు సెకన్ల పాటు భూమి కంపించిందని స్థానికులు చెబుతున్నారు. నిద్రలో ఉన్న సమయంలో భూమి కంపించడంతో పలువురు నిద్రలో నుంచి లేచి... ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.



## ఐసీఏఐ నాయకత్వానికి సీఏ మణిశంకర్ శుభాకాంక్షలు

చెన్నై: ఐసీఏఐ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సీఏ ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సీఏ మంగేశ్ పాండురంగ్ కినారేకు చార్టర్డ్ అకౌంటెంట్ మణిశంకర్ శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణ భారత ప్రాంతీయ మండలికి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కమిటీ సహ-నియమిత సభ్యుడిగా తన హోదాలో మాట్లాడుతూ, ప్రసన్న కుమార్, పాండురంగ్ నాయకత్వంలో వృత్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా చార్టర్డ్ అకౌంటెన్సీ వృత్తి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని వెల్లడించారు. కొత్త నాయకత్వం ఆధ్వర్యంలో ఐసీఏఐ మరింత ఉన్నత ప్రమాణాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## రంజాన్ వేళ పరిశుభ్రత కార్యక్రమాలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): రంజాన్ వేళ జగిత్యాల పట్టణంలోని 16వ వార్డు రహ్మత్‌పూర్ నాఫిసియా మసీదు వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. మజీదు వద్ద డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి స్థానిక ముస్లింలు మున్సిపల్ సిబ్బందితో కలిసి డ్రైనేజ్, పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని 16వ వార్డు కౌన్సిలర్ దుమాల రాజ్‌కుమార్ పర్యవేక్షించారు. వార్డు పెద్దలు నాజిమ్ తదితరులు పాల్గొన్నారు.





## ఏపీ అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాల్స్

### మంత్రి సవిత వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లను ప్రారంభించింది. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు స్టాళ్ల నిర్వహణ కొనసాగనుంది. స్టాళ్ల ద్వారా ప్రఖ్యాతి గాంచిన చేనేత వస్త్రాల విక్రయించనుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిల్లపాది వినియోగించుకునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నారు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించనున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. చేనేత స్టాళ్లతో పాటు ఫొటో స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్ దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లు సందర్శన, వారు చేనేత వస్త్రాల కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు నాయుడు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు పెట్టారు.

**చేనేత అమ్మకాలు పెంచడమే లక్ష్యం : మంత్రి సవిత**

నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికవృద్ధి కలిగించడమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చేనేత వస్త్రాల అమ్మకం, వినియోగం పెంచేలా చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ చిన్న వేడుకగాని, పండుగాని వచ్చినా ప్రత్యేక డిస్కౌంట్లతో చేనేత దుస్తుల అమ్మకాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకూ ఈ స్టాళ్లు నిర్వహిస్తామన్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఈ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో వస్తుంటారన్నారు. వారంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని మంత్రి సవిత తెలిపారు.

### విశాఖలో వేడుకగా


## 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

**భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు**

వైజాగ్, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది. ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు, చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



## ఇది బాబు భజన



### అన్నీ తప్పుడు లెక్కలే

### ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు

తాడేపల్లి, ఫిబ్రవరి 19 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ. 1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ. 94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ. 1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.




# ఏఐతో ట్రాన్స్‌ఫర్మేషన్

## కృత్రిమ మేధ విప్లవానికి భారత్ సారథ్యం.. ఏఐ సదస్సులో ప్రధాని మోదీ వెల్లడి



న్యూఢిల్లీ: 'మానవాళి చరిత్రలో అతి గొప్ప పరివర్తనశీల అధ్యాయానికి ఏఐ నాంది పలికింది. అందులో భారత్ కేవలం ఒక భాగస్వామిగా మిగిలిపోలేదు. ఏఐ విప్లవానికి సారథ్యం వహించి దాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతోంది"అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ వినియోగంలో మానవాళి ఇప్పుడు కీలక కూడలి వద్ద నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఏఐ ప్రస్థానాన్ని నేడు మనం ఏ దిశగా తీసుకెళ్తామన్నది మన రేపటిని, అంటే మానవాళి భవితవ్యాన్ని నిర్దేశిస్తుంది. కృత్రిమ మేధ (ఏఐ) వెల్లువలో అంతిమంగా మనిషి కేవలం ముడిసరుకుగా మిగిలిపోయే పరిస్థితి తలెత్తరాదు. జీపీఎస్ వంటి నావిగేషన్ టూల్స్ మనం ఏయే దారుల్లో వెళ్లొచ్చో సూచిస్తాయి. వాటిలో ఏ దారిని ఎంచుకోవాలన్న నిర్ణయం మాత్రం మనమే తీసుకుంటాం. అలాగే ఏఐ వాడకానికి ఆకాశమే హద్దు కావాలి. కానీ దాని నియంత్రణ మాత్రం నిత్యం మన చేతుల్లోనే ఉండాలి. అది జరగాలంటే ఏఐ వాడకాన్ని ప్రజాస్వామీకరించాలి. మనిషే ప్రధాన కేంద్రంగా దాని వినియోగం ఉండేలా సమగ్ర విధానాలు రూపొందించుకోవాలి"అని పిలుపునిచ్చారు. గురువారం ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సును మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాషియో లులా డసిల్వాతో పాటు పలువురు దేశాధినేతలు, పలు దిగ్గజ ఏఐ కంపెనీల సీఈఓలు తదితరులు సదస్సులో పాల్గొన్నారు. వారందరికీ స్వాగతం పలుకుతూ ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. ఏఐని అపారమైన శక్తి సామర్థ్యాలతో కూడిన పెన్నిధిగా ఆయన అభివర్ణించారు. "ఏఐ వాడకం ఆశించిన దిశగా సాగకుండా దారి మళ్లితే లక్ష్యసాధనకు బదులు వినాశనానికే దారితీస్తుంది. సజావుగా వాడినప్పుడు మాత్రమే మానవాళి ఎదుర్కొంటున్న పెను సమస్యలకు పరిష్కారాలు చూపి ప్రగతికి బాటలు పరుస్తుంది. అలా జరగాలంటే టెక్నాలజీ మనపై పెత్తనం చేయకూడదు. మనమే టెక్నాలజీని నియంత్రించాలి. అందుకోసం అన్ని రంగాల్లోనూ నానాటికీ కీలకంగా మారుతున్న అత్యాధునిక ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వాడుకునేందుకు ప్రపంచ దేశాలన్నీ సమగ్ర విధానాలను రూపొందించుకోవడం చాలా ముఖ్యం"అని సూచించారు. ఇందుకోసం 'మానవ్'విజన్‌ను ఆవిష్కరిస్తున్నట్టు ప్రధాని ప్రకటించారు. అంటే 'నైతిక వ్యవస్థలు (మోరల్, ఎథికల్ సిస్టమ్స్-ఎం), జవాబుదారీతనంతో కూడిన పాలన (అకౌంటబుల్ గవర్నెన్స్-ఏ), దేశాల సార్వభౌమత్వం (నేషనల్ సావర్నిటీ-(ఎన్), అందుబాటులో, సమ్మిళిత (యాక్సిసబుల్, ఇంక్లూజివ్-ఏ), ఆమోదయోగ్య, చట్టబద్ధ (వాలీడ్ అండ్ లెజిటిమేట్-వీ)'అని వివరించారు. ఈ విలువలు ఏఐ సమర్థ వాడకానికి దేశాలన్నింటికీ దారి చూపుతాయని ఆశాభావం వెలిబుచ్చారు. సార్వత్రిక సంక్షేమం, అందరికీ ఆనందమే ఏఐ వినియోగం విషయంలో భారత్ నిర్దేశించుకున్న ప్రమాణమని పేర్కొన్నారు. కనుకనే దాన్ని సదస్సు ఇతివృత్తంగా ఎంపిక చేసినట్టు వివరించారు. "ఏఐ అన్నివిధాలుగా అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. అప్పుడు మాత్రమే అది సర్వ మానవాళికీ మేలు చేస్తుంది. ఇది నా నిశ్చితాభిప్రాయం"అని స్పష్టం చేశారు. ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకునేందుకు భారత్ ఏ మాత్రమూ వెనకాడటం లేదని మోదీ చెప్పారు. పైగా ఈ టెక్నాలజీని ఒక గొప్ప సంపదగా, బంగారు భవిష్యత్తుకు నమూనాగా పరిగణిస్తోందని దేశాధినేతలతో పాటు సభికులందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఏఐ రంగంలో సూపర్ పవర్‌గా నిలిచేందుకు అవసరమైన నైపుణ్యం, వనరులు, విధాన స్పష్టత తదితరాలన్నీ భారత్ సొంతమని పేర్కొన్నారు.

## స్టాక్ మార్కెట్లు విలవిల

### రూ.7.5 లక్షల కోట్లు ఆవిరి!

ముంబై: అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, అధిక ముడిచమురు ధరల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు రెండు వారాల్లో ఎన్నడూ లేనంతగా పతనమయ్యాయి. ఒక్కరోజులో రూ.7.5 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,236.11 పాయింట్లు నష్టపోయి 82,498.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 365 పాయింట్లు పడిపోయి 25,454.35 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద పతనం (సింగిల్ డే) కావడం గమనార్హం. అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితికి దారితీయడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీనికి తోడు బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ వంటి కీలక రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడిని మరింత పెంచింది. టెక్నికల్‌గా, నిఫ్టీ కీలకమైన 25,645–25,660 సపోర్ట్ స్థాయిని కోల్పోవడంతో అమ్మకాలు వేగవంతమయ్యాయని విశ్లేషకులు తెలిపారు. ఈ అమ్మకాల హోరులో సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ వంటి షేర్లు 3.2 శాతం వరకు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.59 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.27 శాతం చొప్పున పడిపోయాయి. రంగాలవారీగా నిఫ్టీ రియల్టీ, మీడియా, ఆటో రంగాలు అత్యధికంగా 2 శాతం మేర నష్టపోయాయి. మరోవైపు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఫిబ్రవరి మొదటి అర్ధభాగంలో వారు రూ.10,956 కోట్ల విలువైన ఐటీ స్టాక్స్‌ను విక్రయించారు. అంతర్జాతీయ అనిశ్చితి, ముడిచమురు ధరల అస్థిరత కారణంగా సమీప భవిష్యత్తులో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## నకిలీ హ్యూమన్ రైట్స్ సంఘాలు

### ఉక్కుపాదం మోపిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. కఠిన చర్యలకు రాష్ట్రాలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: తమ పేరును పోలిన పేర్లతో రిజిస్టర్ అయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నకిలీ సంస్థలు, వ్యక్తులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఇలాంటి సంస్థలపై దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని గురువారం స్పష్టం చేసింది. ఇటీవల తమ దృష్టికి వచ్చిన ఓ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉదహరించింది. ఢిల్లీ ప్రభుత్వంతో 2022లో 'నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)' పేరుతో ఓ ఎన్జీవో రిజిస్టర్ అయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ సంస్థ తమకు నీతి ఆయోగ్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖల గుర్తింపు ఉందని ప్రచారం చేసుకుంటోందని పేర్కొంది. కర్ణాటకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఈ సంస్థకు 'స్టేట్ చైర్మన్'గా వ్యవహరిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఈ వ్యవహారం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఇలాంటి మోసపూరిత పేర్లు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయని, ఈ సంస్థలు ఎన్‌హెచ్‌ఆర్‌సీలో భాగమని లేదా తమచే గుర్తింపు పొందాయని భ్రమ కల్పిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇది ప్రజల్లో కమిషన్ పట్ల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిధుల దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో పలుమార్లు హెచ్చరించినా, ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరును దుర్వినియోగం చేస్తున్న సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రత్యేకించి, ఢిల్లీలో రిజిస్టరై కర్ణాటకలో కార్యకలాపాలు సాగిస్తున్న సదరు నకిలీ సంస్థపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల ఉన్నతాధికారులను ఆదేశించింది.

## ఏఐలో రిలయన్స్ 10 లక్షల కోట్ల పెట్టుబడి

### ఏడేళ్లలో పెట్టుబడిని పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడి

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో కలిసి భారీ అడుగు వేయనున్నాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. 'ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్'లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధిక ఖర్చు అని అంబానీ అన్నారు. ఈ సవాలును అధిగమించేందుకు 'జియో ఇంటెలిజెన్స్' ద్వారా మూడు కీలక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్-స్థాయి ఏఐ-రెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రెండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ-నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.

## అంబాజీ ఆలయానికి అనంత్ అంబానీ 27.5 కోట్ల విరాళం

గాంధీనగర్: ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ మరోసారి వార్తల్లో నిలిచారు. గుజరాత్ లోని సుప్రసిద్ధ అంబాజీ ఆలయానికి రూ. 27.5 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని ప్రత్యేకంగా జై అంబే తిథి భోజన్ యోజన కోసం అందించారు. అంబాజీ ఆలయాన్ని సందర్శించే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అనంత్ అంబానీ ప్రకటించారు. ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు ఈ ఆలయానికి వస్తుంటారు. భక్తులకు రోజుకు రెండుసార్లు ఉచితంగా ఆహారాన్ని అందించేందుకు ఈ డబ్బును వినియోగిస్తారు. ట్రస్ట్ అంచనా ప్రకారం రోజుకు భోజన ఖర్చు సుమారు రూ.1.51 లక్షలు అవుతుంది. అనంత్ ఇచ్చిన నిధులతో వచ్చే 5 ఏళ్ల పాటు ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. నిన్న ప్రారంభమైన భోజన్ యోజనకు తొలి రోజు రూ. 30 కోట్లకు పైగా విరాళాలు అందాయి. ఫిబ్రవరి 18న ప్రారంభమైన యోజనకు మొదటి రోజే విరాళాలు రూ.30 కోట్లు దాటాయి. అందులో అనంత్ ప్రధాన దాత. అహ్మదాబాద్‌కు చెందిన మరో భక్తుడు 35 ప్రత్యేక దినాల భోజన సేవకు రూ.52 లక్షలు ఇచ్చాడు.

# ఐ లవ్ యువర్ కంట్రీ

### ఢిల్లీలో మేక్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: 'ఐ లవ్ యువర్ కంట్రీ.. మీ దేశమంటే నాకు చాలా ఇష్టం' అంటూ భారత్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన, గురువారం ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ భారత్-ఫ్రాన్స్ మధ్య ఉన్న వ్యూహాత్మక సంబంధాల ప్రాముఖ్యతను వివరించారు. ఇదే సమయంలో, రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై భారత్‌లోని కొన్ని వర్గాల నుంచి విమర్శలు రావడంపై ఆయన తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం భారత్‌ను రక్షణపరంగా మరింత బలోపేతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సమ్మిట్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మాక్రాన్, భారత్-ఫ్రాన్స్ మధ్య ఉన్న బంధాన్ని 'ప్రత్యేకమైనది'గా అభివర్ణించారు. వ్యూహాత్మక ప్రయోజనాలున్న అనేక రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 114 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం, భారత రక్షణ సన్నద్ధతకు వ్యూహాత్మక బలాన్ని ఇస్తుందన్నారు. "ఈ ఒప్పందాన్ని కొందరు ఎందుకు విమర్శిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. ఇది మీ దేశాన్ని మరింత శక్తిమంతం చేస్తుంది, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేస్తుంది, ఇక్కడ మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది" అని మాక్రాన్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంలో 'మేక్ ఇన్ ఇండియా' విధానానికే పెద్దపీట వేస్తామని ఆయన హామీ ఇచ్చారు. "గరిష్ఠ సంఖ్యలో భారతీయ విడిభాగాలు, కీలక పరికరాలను భారత్‌లోనే తయారు చేయడానికి, నిర్మించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని ఆయన ఉద్ఘాటించారు. భారత్-ఫ్రాన్స్ భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమైనది మాత్రమే కాదని, దీనిని 'ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం'గా పిలుస్తామని, ఇది ఇరు దేశాలకు ఎంతో ప్రత్యేకమైనదని వివరించారు. ఈ సహకారం భవిష్యత్తులో మరింత విస్తరిస్తుందని మాక్రాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను పటిష్టం చేసే దిశగా వేసిన ఒక ముందడుగు. దీనికి రఫేల్ కీలకం. ఈ సహకారం భవిష్యత్తులో జలాంతర్గాముల వరకు విస్తరిస్తుందని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు. అంతేకాకుండా, బ్రిక్స్ కూటమికి ఛైర్మన్‌గా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, త్వరలో జరగనున్న జీ7 సదస్సులో ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని మాక్రాన్ వెల్లడించారు. ఇది ఇరు దేశాల మధ్య ఉన్న ఉన్నతస్థాయి సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

# బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ అరెస్ట్

### ఎప్‌స్టీన్‌తో సంబంధాలే కారణం



లండన్: బ్రిటన్ రాజకుటుంబంలో మరోసారి పెను కలకలం రేగింది. దివంగత రాణి ఎలిజబెత్-2 రెండో కుమారుడు, ప్రస్తుత రాజు కింగ్ చార్లెస్-3 సోదరుడు అయిన మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్-విండ్సర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికాకు చెందిన లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాల నేపథ్యంలో.. అధికార దుర్వినియోగం ఆరోపణలపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌కు ఆయన పలు కీలక నివేదికలు పంపారని అభియోగాలు ఉన్నాయి. విశేషమేమిటంటే, ఆయన 66వ పుట్టినరోజైన గురువారమే ఈ అరెస్ట్ జరిగింది. ఈస్టర్న్ ఇంగ్లాండ్‌లోని నార్ఫోక్‌లో ఉన్న సాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లోని తన నివాసంలో ఆండ్రూను అరెస్ట్ చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. థేమ్స్ వ్యాలీ పోలీస్ విభాగం ఒక ప్రకటన విడుదల చేస్తూ, నార్ఫోక్‌కు చెందిన 60 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేశామని, అయితే జాతీయ మార్గదర్శకాల ప్రకారం పేరు వెల్లడించడం లేదని పేర్కొంది. కానీ, అరెస్ట్ అయింది ఆండ్రూనేనని బీబీసీ, గార్డియన్ వంటి ప్రముఖ మీడియా సంస్థలు ధృవీకరించాయి. ఆండ్రూ 2010లో బ్రిటన్ వాణిజ్య రాయబారిగా పనిచేసినప్పుడు, జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు అత్యంత రహస్యమైన ప్రభుత్వ వాణిజ్య నివేదికలు, సున్నితమైన పత్రాలు అందించారని ఇటీవల అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఫైల్స్‌లో ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. గతంలో ఎప్‌స్టీన్‌తో తన స్నేహం ఒక పొరపాటని అంగీకరించిన ఆండ్రూ, ఎలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొనలేదని గట్టిగా వాదిస్తూ వచ్చారు. బ్రిటన్‌లో 'పబ్లిక్ ఆఫీస్‌లో మిస్‌కండక్ట్' అనేది చాలా తీవ్రమైన నేరం. ఈ కేసులో నేరం రుజువైతే జీవిత ఖైదు వరకు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆండ్రూ పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఈ అరెస్ట్‌పై రాజకుటుంబం నుంచి గానీ, ఆండ్రూ ప్రతినిధుల నుంచి గానీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ తాజా పరిణామం బ్రిటన్ రాజకుటుంబం ప్రతిష్ఠను మరోసారి ఇబ్బందుల్లోకి నెట్టింది.

# 'ఈశాన్య' ప్రజలూ భారతీయులే!



### వాళ్లపై ఎందుకు వివక్ష?


### నటుడు అక్షయ్ కుమార్

ముంబై: బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాత్యహంకార వివక్ష చోటుచేసుకుంటోందంటూ తీవ్రంగా స్పందించారు. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వీల్ ఆఫ్ ఫార్చ్యూన్' అనే రియాలిటీ షో వేదికగా ఈ సున్నితమైన అంశాన్ని ప్రస్తావించి, దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. షోలో పాల్గొన్న ఓ కంటెస్టెంట్, ఈశాన్య రాష్ట్రాల వారు నిత్యం ఎదుర్కొంటున్న జాతి వివక్ష, అవమానాల గురించి చెప్పడంతో అక్షయ్ ఈ అంశంపై మాట్లాడారు. కేవలం మాటలతో సరిపెట్టకుండా, ఈ సమస్య తీవ్రతను తెలియజేసేందుకు మణిపూర్‌కు చెందిన తన మేకప్ ఆర్టిస్ట్ కిమ్‌ను వేదికపైకి పిలిచారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. తనను చాలామంది 'చైనీస్', 'చింకీ', 'మోమో' వంటి పేర్లతో పిలుస్తూ ఎలా హేళన చేసేవారో వివరించారు. కిమ్ మాటలు విన్న అక్షయ్ కుమార్ చలించిపోయారు. "ఈ రోజు కిమ్ చెప్పిన తర్వాత, ఇలాంటివి నిజంగానే జరుగుతున్నాయని నేను నమ్ముతున్నాను," అని అన్నారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై వివక్ష ఉంది. వారూ భారతీయులే. నేను, మీరు, ఇక్కడ ఉన్నవారు ఎంత భారతీయులమో, వారూ అంతే భారతీయులు," అని స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల్లో వారి త్యాగాలను గుర్తుచేస్తూ, "నాగా రెజిమెంట్ కార్గిల్, బంగ్లాదేశ్ యుద్ధాల్లో రక్తం చిందించింది. వారు ఈ దేశం కోసం ఎంతో చేశారు. వారు మన భారతీయులు" అని అక్షయ్ కుమార్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.


## ధావన్- సోఫీయా పెళ్లి సందడి

### అట్టహాసంగా సంగీత్ నైట్.. నెట్టింట్లో ఫోటోలు వైరల్

టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్, ప్రియురాలు సోఫీ షైన్ పెళ్లి సందడి మొదలైంది. అయేషా ముఖర్జీతో విడాకుల తరువాత ధావన్ తన జీవితంలో మరో కీలక అడుగు వేయబోతున్నాడు. భారత క్రికెట్ జట్టులో తనదైన శైలిలోబ్యాటింగ్ చేస్తూ 'గబ్బర్'గా పాపులర్ శిఖర్ ధావన్, వ్యక్తిగత జీవితంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాడు. తన ప్రేయసి సోఫీ షైన్ (ఐరిష్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్)తో కలిసి ఏడడుగులు వేసేందుకు ఆయన సిద్ధమయ్యాడు. ఫిబ్రవరి 19 గురువారం ధావన్ తన సంగీత్ వేడుకకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. దీంతో ఇవి నెట్టింట సందడిగా మారాయి. అభినందనల వెల్లువ కురుస్తోంది. తన ఇన్‌స్టా హ్యాండిల్‌లో శిఖర్ ధావన్ సోఫీ షైన్ సంగీత్ నైట్ నుండి ఫోటోలను షేర్ చేశాడు. ఆ ఫోటోల్లో శిఖర్ తెల్లటి షేర్వానీలో అందంగా కనిపించగా, సోఫీ బ్లింగీ గా బంగారు రంగు లెహంగాలో కళకళలాడింది. ఈ ఏడాది జనవరి 2న ఈ జంట నిశ్చితార్థం చేసుకున్నారు. ఫిబ్రవరి 19న వివాహం చేసుకోవచ్చని ముందుగా ఊహాగానాలు వచ్చాయి. ప్రస్తుతం వెడ్డింగ్‌డేట్‌పై ధృవీకరణ లేనప్పటికీ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో భాగంగా జరిగిన సంగీత్ నైట్ ఫోటోలు మాత్రం ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి.



లయ్యారి చిత్రం




# రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా కేరళ స్టోరీ: విజయన్

కేరళ స్టోరీ మూవీ.. తమ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ ఆరోపించారు. మతపరమైన విభజనను రెచ్చగొట్టే ఉద్దేశంతోనే సినిమా తీసినట్లు కనిపిస్తోందన్నారు. గతంలోనే దర్యాప్తు సంస్థలు, కోర్టులు లవ్ జిహాద్ అనే అంశాన్ని ప్రూఫ్ లేనిదిగా తేల్చాయని గుర్తుచేశారు. అలాంటి విషయాన్ని మళ్లీ సినిమాగా తీసుకురావడం సమాజంలో ద్వేషాన్ని పెంచే ప్రయత్నమని ఫైర్ అయ్యారు. దేశంలో లిటరసీ, సోషల్ డెవలప్మెంట్ లో ఫస్ట్ ప్లేస్ లో ఉన్న కేరళను ఉగ్రవాదానికి సెంటర్ గా చూపించడం తప్పుడు ఉద్దేశ్యమని పినరయి విజయన్ అన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజల్లో భయం, అపోహలు సృష్టించేందుకు సినిమాను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి విద్వేషపూరిత ప్రచార చిత్రాలను ప్రజలు ఒక్కటై రిజెక్ట్ చేయాలని పిలుపునిచ్చారు. ఆ విషయంలో అధికార ఎల్‌డీఎఫ్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. దీంతో సినిమా.. విడుదలకు ముందే రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అంతే కాదు వివాదం మరింత పెద్దది అవుతుండడంతో రిలీజ్ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న ఉత్కంఠ నెలకొంది. ఇక మూవీ టీమ్ మాత్రం ఆరోపణలను ఖండిస్తోంది. నిర్మాత విపుల్ అమృత్ లాల్ షా, దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ మాట్లాడుతూ, ఎవరినీ టార్గెట్ చేసుకుని సినిమా తీయలేదని స్పష్టం చేశారు. సమాజంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా కథను రూపొందించామని చెప్పారు.









## స్పిరిట్ కోసం 40 కోట్లతో సెట్!

స్పిరిట్ షూటింగ్ అంతర్జాతీయ లోకేషన్స్‌లో జరుగుతోంది. ఇప్పటికే మెక్సికోలో కొన్ని సన్నివేశాలు కూడా ప్లాన్ చేసాడు సందీప్ రెడ్డి వంగా. అయితే ఇది కాఫ్ స్టోరీ కావడంతో అవసరం మేర కొన్ని భారీ సెట్లు కూడా వేయిస్తున్నాడు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ సెట్టింగ్స్ వేసి వాటిలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో భారీ సెట్ వేయించడానికి రెడీ అవుతున్నట్లు తెలిసింది. ఇందులో కీలకమైన యాక్షన్ సన్నివేశాలు ప్లాన్ చేసాడట. దీనిలో భాగంగా ఈ సెట్ నిర్మాణం కోసం దాదాపు 40 కోట్ల వరకూ బట్జెట్ కేటాయిస్తున్నారుట. ప్రభాస్ పై కొన్ని హంటింగ్ సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉందట. దీనిలో భాగంగా ఔడ్ డోర్ లో షూటింగ్ కష్టమవుతుందని భావించి సెట్ కు వెళ్తున్నట్లు తెలిసింది.

## నేడే టాక్సిక్ టీజర్ రిలీజ్

'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసి పారేశాడు యష్ . అప్పటివరకు చిన్న ఇండస్ట్రీగా ఉన్న శాండల్‌వుడ్‌ని పాన్ ఇండియా రేంజ్‌కి తీసుకుపోయాడు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టైలిష్ మేనరిజమ్స్, మాస్ అప్పీల్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఏర్పింది. 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న యష్, ఇప్పుడు 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'తో బిగ్ స్క్రీన్‌పై రీఎంట్రీ ఇవ్వబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తిగా మారింది. టాలెంటెడ్ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌ను కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ వంటి స్టార్ హీరోయిన్లు నటిస్తుండం విశేషంగా మారింది.







## మళ్లీ రేసులోకి ప్రియమణి

హిందీ సిరీస్ ది ఫ్యామిలీ మ్యాన్‌తో వార్తల్లో నిలిచిన ప్రియమణి.. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్‌లలో సినిమాలు, సిరీస్ చేస్తూ వస్తోంది. షారుక్ జవాన్, ధురంధర్ ఫేమ్ ఆదిత్యధర్, జ్యోతీ దేశ్ పాండే సంయుక్తంగా నిర్మించిన ఆర్టికల్ 370 వంటి సినిమాలతో బాలీవుడ్‌లోనూ బిజీ అయింది. ప్రస్తుతం దళపతి విజయ్ కథానాయకుడిగా నటించి చివరి మూవీ జన నాయగన్‌లోని ఓ కీలక పాత్రలో కనిపించనుంది. తమిళంలో జీడీఎన్, తెలుగులో వరలక్ష్మీ శరత్ కుమార్ నిర్మిస్తూ డైరెక్ట్ చేస్తున్న సరస్వతిలో నటిస్తోంది. నటిగా తెలుగులో మాత్రమే కాకుండా తమిళ, మలయాళ, హిందీ భాషల్లో బిజీగా ఉన్న ప్రియమణి మళ్లీ టాప్ లీగ్‌లోకి రావడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా హాలీవుడ్ ప్రేక్షకుల్ని పలకరించబోతోంది. ఈ మూవీతో గ్లోబల్ స్టార్‌గా మారడానికి సిద్ధమవుతోంది. ఓ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ అత్యంత భారీ స్థాయిలో నిర్మించనున్న ఇండో అమెరికన్ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ప్రియమణిని ఓ కీలక పాత్ర కోసం ఎంపిక చేసుకున్నారు.

## కే రాఘవేంద్రరావు స్థానంలో తమ్మారెడ్డి

**గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీలో కీలక మార్పు**



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 జ్యూరీ కమిటీలో కీలక మార్పు చోటు చేసుకుంది. స్పెషల్ అవార్డ్స్ జ్యూరీ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఛైర్మన్‌గా ఉన్న సీనియర్ డైరెక్టర్ రాఘవేంద్ర రావు స్థానంలో తమ్మారెడ్డిని నామినేట్ చేసింది. ఈ మేరకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగు చిత్ర పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో, ప్రజా గాయకుడు ఉద్యమకారుడు గద్దర్ పేరిట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినీ అవార్డులను నెలకొల్పింది. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ అవార్డులను నిర్వహిస్తోంది.తెలుగు సినిమా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసి పురస్కారాలను అందజేస్తోంది. 2025లో తొలిసారిగా గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ అందజేశారు. 2024 సంవత్సరంలో వచ్చిన సినిమాలకు పురష్కారాలు ప్రదానం చేశారు. అలానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకూ విడుదలైన చిత్రాల్లో, ఏడాదికొక బెస్ట్ సినిమాను ఎంపిక చేసి అవార్డ్ ఇచ్చారు.

## తాప్సీని దూరం పెడుతున్న బాలీవుడ్?

కొన్నేళ్లగా బాలీవుడ్‌లో తాప్సీకి తగిన ఫలితం దక్కడం లేదు. సొంతంగా నిర్మాణ సంస్థను స్థాపించింది. క్రియేటివ్ కాన్సెప్ట్ లను నిర్మిస్తూ కొత్త వారికి అవకాశాలు బాగానే కల్పిస్తుంది. ఆ రకంగా అమ్మడిపై పాజిటివ్ ఇంప్రెషన్ ఉంది. కానీ ఏం లాభం నటిగా మాత్రం తాను చేరాలనుకున్న హైట్స్ మాత్రం చేరలేకపోతుంది. తెలుగు సినిమాల్లో ఇదే పరిస్థితి ఎదురైన క్రమలో కొంత నెగిటివిటీని కూడా వ్యక్తం చేసింది. ట్యాలెంట్ కు తగ్గ అవకాశాలు , పాత్రలు పడలేదని అంసంతృప్తిని వ్యక్తం చేసింది. తాజాగా అమ్మడు బాలీవుడ్ పై తీవ్రమైన అసంతృప్తితో ఉందని తెలుస్తోంది. తన మనసుకు నచ్చిన కథలు ఎన్నో ఉన్నా వాటిని తెరకెక్కించాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదని ఆరోపించింది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలైతే మరీ దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయంది. ఎంతో క్రియేటివిటీ ఉన్న కథలకు సరైన అవకాశం దక్కడం లేదంది.



## నా కెరీర్‌పై వారణాసి ప్రభావం: ప్రియాంక

'రాజమౌళికి ఉన్న విజన్ ఎవరికీ లేదు. ఆయనతో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. నా కెరీర్‌పై ఈ సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతున్నాను. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలకు ఇది పూర్తిగా విభిన్నమైనది. ఇండియాలో ఉన్న అత్యుత్తమ దర్శకులలో రాజమౌళి ఒకరు. ఆయన విజనే వేరు. ఆయన సృష్టించే కథలు లార్జర్‌దెన్ లైఫ్ కంటే పెద్దవి. వారణాసి నా కెరీర్‌లోనే అత్యంత నిర్ణయాత్మక చిత్రంగా నిలిచిపోతుంది. ఈ సినిమా రిలీజ్ కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను' అని ప్రియాంక చోప్రా చెప్పుకొచ్చింది. అంతే కాకుండా డైరెక్టర్ రాజమౌళి దార్శనితపై ప్రశంసల వర్షం కురిపించింది. ప్రస్తుతం ప్రియాంక చెప్పిన మాటల నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే సైన్స్ ఫిక్షన్‌కి మించి ఆధ్యాత్మికత, అడ్వెంచరస్ అంశాల నేపథ్యంలో ఈ మూవీని జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. భారతీయ సినిమాల్లో నవ శకాన్ని లిఖించనున్న ఈ సినిమా రానున్న రోజుల్లో సరికొత్త రికార్డులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చర్చకు తెరలేపుతుందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అంచనాలు తారా స్థాయిరి చేరిన ఈ మూవీని 2027, ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.





## మహీకాశర్మతో పాండ్యా రొమాన్స్

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ప్రస్తుతం తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తన ప్రియురాలు మహీకా శర్మ పుట్టినరోజు సందర్భంగా ఆయన పంచుకున్న రొమాంటిక్ ఫోటోలు ఇప్పుడు నెట్టింట సంచలనంగా మారాయి. హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు మహీకా శర్మ 25వ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చాడు. అర్ధరాత్రి వేళ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక రొమాంటిక్ ఫోటోను షేర్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపాడు. ఈ ఫోటోలో వీరిద్దరూ స్విమ్మింగ్ పూల్‌లో జంటగా కనిపించగా.. హార్దిక్ మహీకాను ప్రేమగా కౌగిలించుకుని ఉన్నారు. దీనికి "హ్యాపీ బర్త్ డే, నా యువరాణి " అంటూ క్యాప్షన్ ఇచ్చాడు.



# శ్రీలంక బేజారు.. జింబాబ్వే జోరు!

### ఆతిథ్య జట్టుకు ఓటమి రుచి.. ఓటమి లేకుండానే సూపర్-8కు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో జింబాబ్వే మరో సంచలనాన్ని నమోదు చేసింది. ఇప్పటికే ఆస్ట్రేలియా ఓడించి ఇంటికి పంపించిన జింబాబ్వే.. తాజాగా శ్రీలంకను మట్టికరిపించింది. గ్రూప్-బీలో భాగంగా కొలంబో వేదికగా గురువారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన జింబాబ్వే 6 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. ఈ గెలుపుతో గ్రూప్-బీ టాపర్‌గా సూపర్-8 అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఇప్పటికే శ్రీలంక సూపర్-8 చేరిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్ శ్రీలంక పాతుమ్ నిస్సంక(41 బంతుల్లో 8 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీతో రాణించగా.. పవన్ రత్నాయకే(25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44) పర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో ముజర్బాని, బ్రాడ్ ఇవాన్స్, గ్రేమ్ క్రీమర్ తలో రెండు వికెట్లు తీయగా.. ర్యాన్ బర్ల్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం జింబాబ్వే 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు చేసింది. బ్రియాన్ బెన్నెట్(48 బంతుల్లో 8 ఫోర్లతో 63 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. కెప్టెన్‌గా సికిందర్ రాజా(26 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 45) విలువైన పరుగులు చేశాడు. శ్రీలంక బౌలర్లలో దుషన్ హేమంత రెండు వికెట్లు తీయగా.. దసన్ షనక, దునిత్ వెల్లలేగ చెరో వికెట్ పడగొట్టారు. లక్ష్య ఛేదనలో జింబాబ్వేకు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్, మరుమణి తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించారు. మరుమణి(34) ఔటైనా.. ర్యాన్ బర్ల్(23)తో బ్రియాన్ బెన్నెట్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ర్యాన్ బర్ల్ ఔటైనా.. కెప్టెన్ సికిందర్ రాజా దూకుడుగా ఆడాడు. వేగంగా ఆడే క్రమంలో అతను ఔటైనా.. బెన్నెట్ ఆచితూచి ఆడాడు. 41 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను తీక్షణ వేసిన ఆఖరి ఓవర్‌లో బౌండరీ బాది మరో రెండు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందించాడు. సూపర్-8లో జింబాబ్వే భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికాతో గ్రూప్-1లో ఉంది. తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 23న వెస్టిండీస్‌తో ముంబై వేదికగా ఆడనుంది. ఫిబ్రవరి 26న చెన్నై వేదికగా భారత్‌తో, మార్చి1న సౌతాఫ్రికాతో తమ చివరి సూపర్-8 మ్యాచ్ ఆడనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022 తర్వాత జింబాబ్వే లీగ్ దశ దాటడం ఇదే రెండోసారి మాత్రమే. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022 టోర్నీలో సూపర్-12లో పాకిస్థాన్‌ను జింబాబ్వే ఓడించింది.



## చిత్తుగా ఓడిన ఇటలీ

### 42 పరుగుల తేడాతో గెలిచిన వెస్టిండీస్

టీ20 వరల్డ్ కప్ లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో గ్రూప్-సీలో భాగంగా ఇటలీతో జరిగిన మ్యాచ్ లో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన ఇటలీ టీం బౌలింగ్ తీసుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు ఆరంభంలో బాగానే ఆడినా, మధ్య ఓవర్లలో ఇటలీ బౌలర్ల ధాటికి పరుగులు చేయలేకపోయింది. బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ కరేబియన్ జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (75) ఒక్కడే జట్టును ఆదుకున్నాడు. చివర్లో రోస్టన్ చేజ్ (24), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (24) ఫర్వాలేదనిపించారు. నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ బ్యాటర్లు 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు మాత్రమే చేశారు. 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ ఆరంభంలో దూకుడుగా ఆడింది. మోస్కా బ్రదర్స్ వేగంగా పరుగులు సాధించేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే వెస్టిండీస్ పేస్ దళం రంగంలోకి దిగింది. మ్యాథ్యూ ఫోర్డ్ బౌలింగ్‌లో కీలకమైన టాప్ ఆర్డర్ ఇటలీ బ్యాటర్లను ఔట్ చేశాడు. షమార్ జోసెఫ్ తన పదునైనా బౌలింగ్ తో చెలరేగి నాలుగు వికెట్లు పడగొట్టాడంతో మ్యాచ్ పూర్తిగా విండీస్ వైపు తిరిగింది. 18 ఓవర్లు ఆడిన ఇటలీ జట్టు కేవలం 123 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇటలీపై విజయం ద్వారా వెస్టిండీస్ జట్టు సూపర్- 8 దశకు చేరుకుంది.

## తేనెటీగల దాడితో అంపైర్ మృతి

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. కాన్పూర్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన అంపైర్ మణిక్ గుప్తా(65) తేనెటీగల దాడిలో మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు ఆటగాళ్లతో పాటు మరో అంపైర్ గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. అండర్ 13 మ్యాచ్ జరుగుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆకస్మాత్తుగా మైదానంలో ఉన్నవారిపై తేనెటీగల దాడి చేయడంతో స్టేడియంలో గందరగోళం నెలకొంది. ఆటగాళు ,, ప్రేక్షకులు ప్రాణభయంతో పరుగులు తీసారు. ఆటగాళ్లు చిన్నపిల్లలు కావడంతో వారు త్వరగా తప్పించుకోగలిగారు. కానీ 65 ఏళ్ల మణిక్ గుప్తా త్వరగా పరుగెత్తలేక తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయనను ముందుగా స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కానీ పరిస్థితి విషమించడంతో మరో ఆసుపత్రికి తరిలించారు. కానీ చికిత్స పొందుతూ ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. గుప్తా శరీరంపై వందలాది చోట్ల తేనెటీగలు కుట్టడంతో విషం శరీరమంతా పాకి 'అనాఫిలాక్టిక్ షాక్'గురై మృతి చెందారని వైద్యులు పేర్కొన్నారు. మరొ అంపైర్ జగదీశ్ శర్మతో సహా పలువురు ఆటగాళ్లు గాయపడ్డారు. మణిక్ గుప్తాకు కాన్పూర్ క్రికెట్ అసోసియేషన్‌తో 30 ఏళ్ల అనుబంధం ఉంది. ఆయన అనేక ప్రాంతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించారు. ఈ ఘటనపై మరో అంపైర్ సునీల్ మీడియాతో మాట్లాడారు. మ్యాచ్ రెండో ఇన్నింగ్స్ సమయంలో ఆటగాళ్లు నీరు తాగుతుండగా తేనెటీగల గుంపు ఆకస్మాత్తుగా దాడి చేసిందని తెలిపారు. అందరూ నేలపై పడుకోవాలని సూచించినప్పటికీ తేనెటీగల దాడి కొనసాగిందని చెప్పారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా.. క్రికెట్ వర్గాలు మాణిక్ గుప్తా మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా.. తేనెటీగలు దాడి చేయడం ఇదే తొలిసారి కాదు. 2019లో తిరువనంతపురం వేదికగా భారత్-ఏ, ఇంగ్లండ్ లయన్స్ వన్డే మ్యాచ్ తేనెటీగల దాడితో ఆగిపోయింది.

## పాక్ ప్లేయర్లలో 'ఓటమి' కుంపటి

పాకిస్థాన్ క్రికెట్లో సీనియర్లు, ప్రస్తుత ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ముఖ్యంగా టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌పై పాకిస్థాన్ ఓడిపోయిన తర్వాత మాజీ ఆటగాళ్లు ప్రస్తుత జట్టును తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ చేసిన ఓ కామెంట్ పాక్ మాజీ దిగ్గజాలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి తర్వాత బాబర్ ఆజం, షాహీన్ అఫ్రిద్, షాదాబ్ ఖాన్లను జట్టు నుంచి తొలగించాలని మాజీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన షాదాబ్ ఖాన్.. 'విమర్శించడం అనేది మా చేతుల్లో లేదు. మాజీ ఆటగాళ్లకు వారి సొంత అభిప్రాయాలు ఉంటాయి. వారు లెజెండ్స్ కావచ్చు, కానీ మేము చేసిన పనిని వారు కూడా చేయలేకపోయారు. ప్రపంచకప్‌లో మేము భారత్‌ను ఓడించాం (2021లో). విమర్శలు క్రికెట్ చరిత్రలో భాగమే' అని వ్యాఖ్యానించాడు. తాము 2021 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను ఓడించామని, గతంలోని లెజెండ్స్ ఆ పని చేయలేకపోయారని షాదాబ్ పరోక్షంగా ఎద్దేవా చేశాడు. షాదాబ్ వ్యాఖ్యలపై పాక్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ టీవీ షోలో నిప్పులు చెరిగారు. షాదాబ్ ఖాన్ మామగారైన దిగ్గజ స్పిన్నర్ సక్లయిన్ ముస్తాక్‌ను ఉదాహరణగా తీసుకుంటూ బాసిత్ అలీ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## తొలి టీ20లో భారత్-వుమెన్ ఓటమి

ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ప్రారంభించిన భారత మహిళల జట్టుకు అనూహ్య పరాజయం ఎదురైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా కాన్‌బెర్రా వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. భారత బ్యాటర్ల వైఫల్యం ఓటమిని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జియో వోల్(57 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 88), బెత్ మూనీ(39 బంతుల్లో 4 ఫోర్లతో 46) టాప్ స్కోరర్‌గా నిలిచారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి(2/30) రెండు వికెట్లు తీయగా.. రేణుకా సింగ్(1/27) ఒక వికెట్ తీసింది. అనంతరం భారత మహిళల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులే చేసి ఓటమిపాలైంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(30 బంతుల్లో 5 ఫోర్లతో 36), స్మృతి మంధాన(24 బంతుల్లో 4 ఫోర్లతో 31) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో అష్లే గార్డ్‌నర్ మూడు వికెట్లు తీయగా.. కిమ్ గార్త్, అన్నబెల్ సదర్లాండ్, సోఫీ మోలినక్స్ రెండేసి వికెట్లు తీసారు. ఈ విజయంతో మూడు టీ20ల సిరీస్ 1-1తో సమమైంది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో టీ20 శనివారం జరగనుంది.



### చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్

ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్ హర్మన్‌ప్రీత్‌కు కెరీర్‌లో 356వ అంతర్జాతీయ మ్యాచ్. ఈ క్రమంలో ఆమె న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్‌ను అధిగమించింది. న్యూజిలాండ్ తరఫున సుజీ బెట్స్ 355 మ్యాచ్‌లు ఆడింది. ఎల్లిస్ పెర్రీ(349), మిథాలీ రాజ్(333), చార్లోట్ ఎడ్వర్డ్స్(309) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ జాబితాలో హర్మన్‌ప్రీత్ కౌర్, ఎల్లిస్ పెర్రీ, సుజీ బేట్స్ మాత్రమే అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతున్నారు. మిగతా ప్లేయర్లు రిటైర్మెంట్ ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ఇది 189వ టీ20 మ్యాచ్. 2009 అరంగేట్రం చేసిన హర్మన్‌ప్రీత్.. 29.33 సగటుతో 3784 పరుగులు చేసింది. 2009 వన్డే ప్రపంచకప్‌తో 50 ఓవర్ల ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేసిన హర్మన్.. 161 మ్యాచ్‌ల్లో 7 శతకాలతో 4409 పరుగులు చేసింది. 2014 నుంచి ఇప్పటి వరకు 6 టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. హర్మన్ సారథ్యంలోనే భారత మహిళల జట్టు తొలి వన్డే ప్రపంచకప్ 2025 గెలిచింది. ఆమె మూడు టెస్ట్‌లతో పాటు 48 వన్డేలు, 134 టీ20ల్లో భారత్‌కు సారథ్యం వహించింది.

## కెనడాపై ఆఫ్ఘనిస్థాన్ విన్

టీ20 ప్రపంచకప్ 2026లో ఆఫ్ఘనిస్థాన్ జట్టు తమ ప్రస్థానాన్ని ఘన విజయంతో ముగించింది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన ఆ జట్టు, తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కెనడాపై 82 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కెనడా బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఇబ్రహీం జాద్రాన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 56 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 95 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి తోడుగా సెదికుల్లా అటల్ (44), రహ్మానుల్లా గుర్బాజ్ (30) రాణించారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ భారీ స్కోరు నమోదు చేసింది. కెనడా బౌలర్లలో జస్కరన్‌దీప్ సింగ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం 201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కెనడాను ఆఫ్ఘన్ బౌలర్లు కట్టడి చేశారు. సీనియర్ ఆల్ రౌండర్ మహమ్మద్ నబీ తన స్పిన్ మాయాజాలంతో కెనడా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కేవలం 4 ఓవర్లలో 7 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ రషీద్ ఖాన్ 2 వికెట్లు తీశాడు. దీంతో కెనడా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో ఆఫ్ఘనిస్థాన్ గ్రూప్ డిలో 4 మ్యాచ్ లలో రెండు విజయాలతో తమ ప్రయాణాన్ని ముగించింది.





## ముందుంది ముసళ్ల పండగ: సెహ్వాగ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియాను మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ హెచ్చరించాడు. సూపర్-8 దశలో అసలు సిసలు సవాల్ ఎదురువుతుందని తెలిపాడు. ఇప్పటి వరకు టీమిండియాకు గట్టి పోటీ ఎదురవ్వలేదని, బౌలింగ్ విభాగం బలహీనంగా కనిపిస్తుందన్నాడు. బౌలింగ్‌పై తక్షణ సమీక్ష చేయాలని సూచించారు. నెదర్లాండ్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించి అజేయంగా సూపర్-8కు చేరిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 176 పరుగులు చేయడం భారత బౌలింగ్ బలహీనతను బయటపెట్టిందని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. 'ఇప్పటి వరకు భారత్‌కు అసలైన సవాలు ఎదురవ్వలేదు. తొలి మ్యాచ్‌లో తడబడినా.. తర్వాత నిలకడైన ఆటతీరు కనబరిచింది. అసలైన పరీక్ష సూపర్ 8 దశలోనే ఎదురుకానుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో భారత్ 193 పరుగులు చేసినా.. 176 పరుగులు సమర్పించుకుంది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన జట్టు బౌలింగ్ విభాగంపై ఫోకస్ పెట్టాలి. బౌలింగ్ విభాగం బలోపేతం చేయడంపై సమాలోచనలు చేయాలి. అభిషేక్ శర్మ, శివమ్ దూబే వంటి పార్ట్‌టైమ్ బౌలర్లను పెద్ద జట్లపై వాడటం ప్రమాదం. వారు ఒక ఓవర్‌లో 15 పరుగులు ఇస్తే మ్యాచ్ మూమెంటమ్ మారిపోతుంది. కాబట్టి భారత్ ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి రిస్క్‌లు తీసుకోకూడదు.'అని వీరేంద్ర సెహ్వాగ్ సూచించాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ ఏడుగురు బౌలర్లను ఉపయోగించింది. ప్రధాన బౌలర్లు బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి 9 ఓవర్లలో 53 పరుగులు ఇవ్వగా.. ఇతర బౌలర్లు 11 ఓవర్లలో ఏకంగా 123 పరుగులు సమర్పించుకున్నారు. ఇది ఆందోళన కలిగిస్తోంది. అయితే మ్యాచ్ అనంతరం ఈ వ్యవహారంపై సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. మంచు ప్రభావం కారణంగా తమ బౌలర్లు పరుగులిచ్చుకున్నారని వెనకేసుకొచ్చాడు. సూపర్ 8 దశకు ముందు అందరికీ బౌలింగ్ ప్రాక్టీస్ కల్పించాలనే ఉద్దేశంలో బౌలింగ్ చేయించామని వివరణ ఇచ్చాడు.

ఈవార్తలు ప్రజావాణి

సంపాదకీయం www.evarthalu.com

నేటి ఈవార్తలు

శుక్రవారం 20-2-2026

# తెలంగాణకు 'పెద్దల' ఆమోదం

**తెలంగాణ** చరిత్రలో ఫిబ్రవరి 20 ఒక అపురూపమైన రోజు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు, వందలాది మంది అమరవీరుల త్యాగాలకు, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు దేశ అత్యున్నత చట్టసభ 'రాజ్యసభ'లో అంతిమ విజయం లభించిన రోజు ఇది. లోక్‌సభలో అప్పటికే ఆమోదం పొందిన బిల్లు, రాజ్యసభలోనూ గట్టెక్కడంతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఉన్న ఆఖరి అడ్డంకి తొలగిపోయింది. ఈ బిల్లు ఆమోదం కేవలం ఒక భౌగోళిక విభజన కాదు; ఇది ఒక ప్రాంతం తన స్వయంప్రతిపత్తి కోసం చేసిన అహింసాయుత పోరాట ఫలితం. 1956 ఫిబ్రవరి 20న ఇదే రోజున పెద్దమనుషుల ఒప్పందం ద్వారా ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలు కలిశాయి. యాదృచ్ఛికమో ఏమో కానీ, సరిగ్గా 58 ఏళ్ల తర్వాత అదే రోజున పార్లమెంటులో రాష్ట్ర విభజనకు ఆమోదం లభించడం కాలం చేసిన విచిత్రమైన న్యాయం. నాడు రాజ్యసభలో బిల్లు చర్చకు వచ్చినప్పుడు చోటుచేసుకున్న పరిణామాలు ఉత్కంఠభరితం. గందరగోళం, నిరసనల మధ్యే అప్పటి యూపీఏ ప్రభుత్వం, ప్రతిపక్ష బీజేపీ సహకారంతో బిల్లు నెగ్గింది. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో సాగిన ఉద్యమం, పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా చట్టబద్ధతను సంతరించుకుంది. ఈ రోజును గుర్తు చేసుకోవడం అంటే కేవలం గతాన్ని నెమరువేసుకోవడం కాదు; ఆనాడు ప్రజలు కోరుకున్న 'బంగారు తెలంగాణ' లక్ష్యం ఎంతవరకు నెరవేరిందో సమీక్షించుకోవడం. స్వయం పాలనలో అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకూ చేరడమే ఆనాటి పోరాటానికి నిజమైన నివాళి. ఫిబ్రవరి 20 అనేది తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక. పార్లమెంటు సాక్షిగా జరిగిన ఈ చారిత్రక ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతుక ఎంతటి శక్తివంతమైనదో చాటిచెప్పింది.ఽ

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**






# పుర తీర్పు.. మేల్కొలుపు

తెలంగాణ పురపాలక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకున్నప్పటికీ, ఆ విజయం ఆశించినంత ఏకపక్షంగా ఏమీ లేదు. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు, బీజేపీ కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. అయితే, ఈ ఫలితాల అంతరార్థం మాత్రం స్పష్టం: ఓటరు దేవుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా మొట్టికాయలు వేశాడు. 'మేము అధికారమిచ్చింది పాలించడానికి, కేవలం గెలవడానికి కాదు' అన్న సంకేతాన్ని పట్టణ ఓటరు బలంగా పంపారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 1,500 కంటే ఎక్కువ వార్డులను గెలుచుకుని, 5 కార్పొరేషన్లు, 80కి పైగా మున్సిపాలిటీల్లో పీఠాలను దక్కించుకుంది. కానీ లోతుగా పరిశీలిస్తే, ఇది 'అధికార పార్టీకి ఉండే సహజమైన సానుకూలత' వల్ల వచ్చిన విజయమే తప్ప, ప్రభుత్వంపై విపరీతమైన ప్రేమతో వచ్చిన ప్రభంజనం కాదు. అనేక చోట్ల రెబెల్ అభ్యర్థులు, స్వతంత్రులు కాంగ్రెస్ అధికారిక అభ్యర్థులకు చెమటలు పట్టించడం, కొన్ని చోట్ల హంగ్ ఏర్పడటం ఓటరు అసంతృప్తికి నిదర్శనం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో జరుగుతున్న ఆలస్యంపై పట్టణ ఓటర్లలో స్పష్టమైన అసంతృప్తి కనిపిస్తోంది. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి పథకాలు అందరికీ అందకపోవడం ప్రభావం చూపింది. పట్టణాల్లో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడకపోవడం, మంచినీటి ఎద్దడి వంటి ప్రాథమిక సమస్యలు అలాగే ఉండటం ప్రజలను ఆగ్రహానికి గురిచేసింది. క్షేత్రస్థాయిలో పాలన యంత్రాంగం సరిగ్గా స్పందించకపోవడం, అవినీతి ఆరోపణలు పెరగడం ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీశాయి. అధికార పార్టీ నేతల మధ్య సమన్వయ లోపం, టికెట్ల పంపిణీలో అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయి. బీఆర్ఎస్ తన పట్టు కోల్పోయినట్లు కనిపిస్తున్నా, దాదాపు 700కు పైగా వార్డుల్లో విజయం సాధించి ఇంకా రేసులోనే ఉన్నానని చాటింది. బీజేపీ ఉత్తర తెలంగాణలో తన బలాన్ని నిరూపించుకుంటూ నిజామాబాద్, కరీంనగర్ వంటి కీలక చోట్ల ఆధిక్యం కనబరిచింది. ఓటరు ప్రస్తుతానికి కాంగ్రెస్‌కే ఓటేసినా.. 'హెచ్చరిక' మాత్రం గట్టిగానే ఇచ్చాడు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు (2028) ఈ మున్సిపల్ ఫలితాలు ఒక సెమీఫైనల్ వంటివి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తీర్పును కేవలం విజయంగా చూసి మురిసిపోతే ప్రమాదమే. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వేగం పెంచకపోతే, ఇప్పుడు మొట్టికాయలు వేసిన ప్రజలే రేపు వ్యతిరేక తీర్పు ఇవ్వడానికి వెనకాడరని గుర్తుంచుకోవాలి.

**- రాములు గడియారం, వరంగల్, రాజకీయ విశ్లేషకుడు**

# నాది.. నాదే!

భారతదేశంలో యువత ఇప్పుడు సాంప్రదాయ ఉద్యోగాలకు బదులుగా సొంత వ్యాపారాలు ప్రారంభించడంపై ఎక్కువ ఆసక్తి చూపుతోంది. గత కొన్ని సంవత్సరాల్లో ఈ ధోరణి గణనీయంగా పెరిగింది. ఒక సర్వే ప్రకారం, భారతీయ విశ్వవిద్యాలయాల్లో 75% మంది విద్యార్థులు తమ సొంత వెంచర్లు ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నారు. ఇది కేవలం ఒక ట్రెండ్ మాత్రమే కాదు, ఇది ఆర్థిక, సామాజిక మార్పులకు సంకేతం. యువతలు ఒకరి కింద పనిచేసేకంటే, తక్కువ లాభాలు వచ్చినా సరే సొంతంగా ప్రయత్నించడానికి మొగ్గు చూపుతున్నారు.






మార్పుకు పలు కారణాలు ఉన్నాయి - మార్కెట్‌లో నైపుణ్యాలకు తగ్గ జీతాలు లేకపోవడం, పై అధికారుల వేధింపులు, ఉద్యోగ భద్రత లోపం వంటివి. ప్రపంచంలో అత్యంత ఎక్కువగా యువ జనాభా ఉన్న దేశాల్లో ఒకటి, మధ్యస్థ వయస్సు 28 సంవత్సరాలు. 2025లో, అండర్-30 ఎంట్రప్రెన్యూర్స్ 79 మంది 5.2 బిలియన్ డాలర్ల ఫండింగ్ సేకరించారు, 64,000 ఉద్యోగాలు సృష్టించారు. ఇది స్వయం-నిర్మిత ఎంట్రప్రెన్యూర్స్ పెరుగుదలను సూచిస్తుంది, 66 మంది సెల్ఫ్-మేడ్ అని హురున్ రిపోర్ట్ చెబుతోంది. స్టార్టప్ ఇండియా పథకం 2025-26లో మరిన్ని స్టార్టప్‌లను ప్రోత్సహించింది, టెక్నాలజీ, సర్వీసెస్, మాన్యుఫాక్చరింగ్ సెక్టర్లలో ఉద్యోగ సృష్టి పెరిగింది. రూరల్ ఏరియాల్లో కూడా 44% యువత సొంత వ్యాపారాలు ప్రారంభించాలని ఆసక్తి చూపుతోంది. ఈ ట్రెండ్ 2025లో డిజిటల్ అడాప్షన్, ఇన్నోవేషన్‌తో మరింత వేగం పుంజుకుంది. మార్కెట్‌లో నైపుణ్యాలకు తగ్గ జీతాలు లేకపోవడం వల్ల యువత సొంతదారుల్లో వెళ్తున్నారు. గ్రాడ్యుయేట్ సాలరీలు తక్కువగా ఉండటంతో, స్టార్టప్ చేయడం రిస్క్ కాకుండా ప్రూడెంట్ ఆప్షన్‌గా మారింది. అదీ వారి ఆలోచనల స్థాయిని పెంచింది. అదీకాక.. ఉద్యోగాల్లో స్ట్రెస్‌కు బదులు సొంతంగా బిజినెస్ బిల్డ్ చేయాలని చూస్తున్నారు. సోషల్ మీడియా, లో-కాస్ట్ మార్కెటింగ్ ద్వారా యువత సులభంగా వ్యాపారాలు స్టార్ట్ చేస్తున్నారు. జాబ్ సీకర్స్ నుంచి జాబ్ క్రియేటర్స్‌గా మారుతున్నారు. స్టార్టప్ ఇండియా, ముద్రా యోజన వంటివి ఫండింగ్, ఇన్‌క్యుబేషన్ అందిస్తున్నాయి. పలు రాష్ట్ర ప్రభుత్వాలు స్టార్టప్‌లను ఎంకరేజ్ చేస్తున్నాయి. గతంలో 56% యువత బిజినెస్ అంటూ ఫెయిల్ అవుతామేమోనని భయపడేవారు, ఇప్పుడు రిస్క్ టేకింగ్ పెరిగింది. తద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక మార్పులు సంభవించాయి. ఈ ట్రెండ్ భారత ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ ఇస్తోంది. యువ ఎంట్రప్రెన్యూర్స్ ఇన్నోవేషన్, జాబ్ క్రియేషన్, సోషల్ ఇన్‌క్లూజన్ ప్రోమోట్ చేస్తున్నారు. 2025లో టెక్, హెల్త్‌కేర్, కన్స్యూమర్ గూడ్స్ సెక్టార్లలో స్టార్టప్‌లు పెరిగాయి. చివరగా భారతీయ యువతలో సొంత బిజినెస్ కుతూహలం పెరగడం ఒక సానుకూల మార్పు, కానీ దీన్ని సస్టైనబుల్‌గా చేయాలి. లో సాలరీలు, వేధింపులు వంటి కారణాలు యువతను వ్యాపారంవైపు నడిపిస్తున్నాయి.

**- జీఆర్ కరుణాకరణ్, ఎకానమిస్టు, చెన్నై**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.